# దైవ లక్షణములు స్తుతి

ఓ త్రియేక దేవుడవైన ప్రభువా! నీ దివ్యలక్షణములు మా జీవిత కాలముయొక్క ఉపయోగార్థమై వాడుచున్నావు. గనుక నీకు స్తోత్రములు. నీ వెలుగు మాలో ప్రవేశపెట్టుచున్నావు, నీలోని జీవము మాలో ప్రవేశ పెట్టుచున్నావు. నీలోని ప్రేమ మా విషయమై చూపించుచున్నావు. నీలోని శక్తి మా బలహీనత సమయములో చూపించుచున్నావు. నీలోని న్యాయము ద్వారా మమ్మును తప్పుదారిలో నుండి తప్పించుటకు ప్రయత్నించుచున్నావు. నీలోని పరిశుద్ధతతో మమ్ములను పవిత్రపరచుచున్నావు. నీలోని నిరాకారముతో మాలోని విశ్వాసమును బలపరచుచున్నావు. నీలోని సర్వ సద్గుణముల నిమిత్తమై నీకు వందనములు. నీ సద్గునములు మాలో ప్రవేశపెట్టుటకు నిత్యము ప్రయత్నించుచున్నావు. గనుక నీకు స్తోత్రములు. నీ అనాదిలో అనంతమున్నది. నీ అనంతములో ప్రేమ యున్నది. నీ ప్రేమలో న్యాయమున్నది. నీ న్యాయములో పరిశుద్ధత యున్నది. నీ పరిశుద్ధతలో శక్తియున్నది. నీ శక్తిలో నిరాకారమున్నది. నీ నిరాకరములో ప్రత్యక్షతయున్నది. నీలోని ప్రతీ ఒక్క లక్షణములో అన్ని లక్షణములు ఇమిడి ఉన్నవి. ఒక్క లక్షణము మాలో పెట్టియున్నావు అని తలంచినప్పుడు తక్కినవి కూడ పెట్టియున్నావని మేము గ్రహించుకొను చున్నాము. నీకు ఆదిలేదు అని మేము గ్రహించుకొనుచున్నాము. నీకు అంతము లేదు అని మేము అనుకొన్నప్పుడు నీలోని అన్ని గుణములకు కూడ అంతము లేదని మేము గ్రహించుకొనుచున్నాము. తండ్రిని, కుమారుని, పరిశుద్ధాత్మను మేము ఎట్లు విడదీయలేమో అట్లే కలిసియున్న నీ గుణములను వేరుచేయలేము. ఒక్క లక్షణమును గురించి, మా మనస్సు లోనికి తలంపు వచ్చినయెడల లక్షణములన్నియు దొంతిగా జ్ఞాపకమునకు వచ్చునని తెలుసుకొనుచున్నాము. నీకు ఎన్ని దివ్యలక్షణములున్నవో అవన్నియు

సమానముగానున్నవి. అవన్నియు మాలో శాశ్వతముగా నుండునట్లు ముద్రవేయగోరుచున్న నీకు అనేక స్తోత్రములు. అగ్ని జ్వాలలో ఒకటి వేడి, రెండవది వెలుగు, మూడవది ఆకారము – ఇవి ఎట్లు కలిసియున్నవో అట్లే తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను దేవుడవైన నీవును ఉన్నావు. గనుక నీకు అనేక స్తోత్రములు. జ్వాలలో నున్న మూడింటిలో ఒకటి తీసివేసిన తక్కిన రెండును ఆగిపోవును, తక్కిన రెంటిని కూడా మనము తీసివేసినట్లే. నీ దివ్య లక్షణములలో ఒకటి మాకు అక్కర లేదన్నయెడల తక్కిన లక్షణములన్నియు అక్కర లేదు అనినట్లే నీవు న్యాయమైన రీతిగా ఒకరిని శిక్షించినప్పుడు మా కిష్టముండదు. అలాగైనయెడల నీవు మమ్మును ప్రేమించినప్పుడు మాకు ఎందుకు ఇష్టముండవలెను? మా విమర్శ సరికాదు. నీ విమర్శ పవిత్రమైనది. కాబట్టి నీకు వందనములు. మాలో ఎవరు నీ గుణలక్షణములన్నియు సంపాదించుకుంటారో వారు నీయొద్దకు రాక మరి ఎవరియొద్దకు వెళ్ళుదురు!

ఓ దేవా! నీలోనున్న గుణములన్నియు మాలో స్థిరముగా నుండునట్లు కృప దయచేయుము. దయగల ప్రభువా! నీ గుణములన్నియు మేము మా ఇష్టము వచ్చినంత ధారాళముగా వాడుకొనునట్లు నీవు మాకు స్వతంత్రత లక్షణము కూడ అనుగ్రహించినావు. అన్నియు అనుగ్రహించి స్వతంత్రత ఒక్కటే అనుగ్రహింపనియెడల, అవన్నియు ఇచ్చిన ప్రయోజనము లేదు. కాబట్టి అదికూడ యిచ్చినందుకు నీకనేక వందనములు.

నీ లక్షణములన్నియు మాకనుగ్రహించినప్పుడు, మేము వాటిని అందుకొన్నప్పుడు అవన్నియు మా హృదయములలో దొంతర్లుగా అమర్చి పెట్టిన వెలుగువలె ఉండును. స్తోత్రములు.

దీపములను దగ్గర దగ్గరగా పెట్టిన వాటి కాంతి ఒకదానికొకటి అంటుకొనును. ఒకదాని కాంతి మరియొకదానిలో అనుసరించియే ఉండును, గాని వేరుగా ఉండదు. అలాగే నీ లక్షణములు ఒక దానికొకటి

హత్తుకొని యుండును. అట్లే అవి మాలో కూడా హత్తుకొని యుండునట్లు భద్రపరచుము. దీపములను వెలిగించువారు, వాటిని ఆరిపోకుండా ఎట్లు కాపాడుదురో, అట్లే మాలో నీవు నీ దీపమును పెట్టి వెలిగించినావు గనుక ఆరిపోకుండునట్లుకాపాడుము. "నేను లోకమునకు వెలుగైయున్నాను" అని నీవు చెప్పినావు గదా! లోకములో అనగా ప్రతి మనిషిలో నీ వెలుగు పెట్టి యున్నావని మేము గ్రహించుచూ నీకు వందనములు చేయుచున్నాము.

మరియు మనుష్యులను చూచి "మీరు లోకమునకు వెలుగై యున్నారు" అని నీవు చెప్పినావు గదా! కాబట్టి మాలో నీ వెలుగు పెట్టి యున్నావని మేము గ్రహించుచున్నాము. నీకు వందనములు. తండ్రీ! నీలో వెలుగు ఆ కాలమందున్న వారు చూచినారు. ఆలాగే మాలో నీవు పెట్టిన వెలుగు ఇతరులు చూచునట్లు చేయుము. వెలుగు అనగా నీ అని గుణముల యొక్క సముదాయము అని మేము గ్రహించుచున్నాము.

ప్రభువా! నీ సృష్ఠివలన, నీ ప్రవర్తన వలన మాలో వెలుగు పెట్టియున్నావు. మీ వెలుగును ప్రకాశింపనియ్యుడి అని చెప్పుచున్నావు. లెమ్ము, తేజరిల్లుము అని యెషయా 60:1 వాక్యములోనున్నది. గనుక మాలో నున్న దైవలక్షణములు యితరులకు కనబడునట్లు, వారియెదుట మా వెలుగు ప్రకాశింపనీయగల శక్తి దయచేయుము. స్విచ్ఛ్ (Switch) నొక్కనప్పుడు దానిలో వెలుగున్నది. గాని బయటకు కనబడదు. నొక్కి నప్పుడు ఆ వెలుగు బయటకు కనబడును. అలాగే దేవా! నీవు మాలో పెట్టిన నీ గుణములను మా జ్ఞానము చేత నొక్కిన యెడల నీ లక్షణములు బయటకు కనబడును. నీకు వందనములు.

దేవా! నీవు మాలో పెట్టిన నీ దివ్యలక్షణములలో యేదో యొక లక్షణము యొక్క కాంతి తగ్గిపోవునప్పుడు పూర్తిగా ఆరిపోనీయక మరల వెలిగించుచుండుము.

1) దేవా! మా దీపము ఎప్పుడు ఆరిపోకుండ కాపాడుము. 2) దేవా! నీ గుణములు ఎప్పుడు తప్పిపోకుండా కాపాడుము. 3) ప్రభువా! నీ గుణములు ఎప్పుడు ఇతరులకు కనబడునట్లు కాపాడుము. ఈ మా ప్రార్థనా స్తుతులు యేసు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

**వివరము:-** నాలుగు దీపములలో ఒకటి తగ్గినప్పుడు, యజమానుడు మరల వెలిగించును. ఇది వరకు నేను చెప్పినట్లు ఒక దీపము ఆరిపోయిన యెడల తక్కినవన్నియు ఆరిపోవును. ఈ పని జీవితాంతమందు జరుగును. కృపాకాల మందు జరుగదు. ఒక దొంగలో మంచి గుణము కూడ ఉండుట మనము చూచుచున్నాము గదా!

**పరీక్ష:-** దేవుడు మీలో ఉంచిన తనయొక్క మంచి గుణములలో ఏ మంచి గుణము మీలో ఈ వేళవరకు నిలిచివున్నదో పరీక్షించుకొనుడి. ప్రేమ, న్యాయము, దీర్ఘశాంతము, ఏదివున్నదో పరీక్షించుకొనుడి. అనాది మాత్రము ఉండదు. అనంతము ఉండవచ్చును. మీతో మాట్లాడి మసలే జీవముకాక, ఆత్మీయ జీవమున్నదో లేదో మీకు మీరే పరీక్ష చేసికొనుడి. మీలో దేవుడు పెట్టిన ప్రేమ వున్నదా, తగ్గినదా? సన్నిధి కూటమువల్ల ఈ లక్షణములు తగ్గకూడదు. వృద్ధికావలెను. అలా కాకపోతే సన్నిధి కూటములు ఎత్తివేయవలెను.

**ఈ క్రింది దైవలక్షణములను బట్టి మిమ్ములను మీరే పరిశీలించుకొనండి.**

1) పరీక్షించండి, 2) ప్రార్థించండి, 3)స్తుతించండి, 4)స్థిరపడండి.

1) జీవము ఉన్నదో లేదో పరీక్షించండి లేకపోతే ప్రార్థించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

2) ప్రేమ ఉన్నదో లేదో పరీక్షించండి. లేకపోతే ప్రార్థించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

3) పరిశుద్ధత ఉన్నదో లేదో పరీక్షించండి. లేకపోతే ప్రార్థించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

4) న్యాయము ఉన్నదో లేదో పరీక్షించండి. లేకపోతే ప్రార్ధించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

5) స్వతంత్రత ఉన్నదో లేదో పరీక్షించండి. లేకపోతే ప్రార్ధించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

6) జ్ఞానము ఉన్నదో లేదో పరీక్షించండి. లేకపోతే ప్రార్ధించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

7) సర్వవ్యాపకత్వము ఉన్నదో లేదో పరీక్షించండి. లేకపోతే ప్రార్ధించండి. ఉంటే స్తుతించండి. ఇట్లు స్థిరపడండి.

# ౨. దైవలక్షణముల స్తుతి

## (సంఘారాధనలోని స్తుతులు)

**1. అనాది:-** అనాది దేవా! సృష్ఠింపబడకుండ నీ యంతట నీవే ఉన్నావు. గనుక నీవు ముందే ఉండి, మా చరిత్ర అంతటిని చూచుచూ మాకు కావలసినవన్నియు ముందే ఏర్పాటు చేసియున్నావు. గనుక నీకు మా వందనములు.

**2. అనంతము:-** అనంత దేవా ! నీవు ఎల్లప్పుడు ఉండువాడవు గనుక అంతములేని కాలము వరకు కావలసినవన్నియు మేము అనుభవించుటకై నీ అనంత సన్నిధిని మా కొరకై ఉంచిన నీకు స్తుతులు.

**3. ప్రేమ:-** ప్రేమవైయున్న తండ్రీ! నీవు ముగ్గురుగా (త్రిత్వముగా) బయలుపడకపోయిన, మేము నిన్ను ప్రేమించుట ఉండదు. నీ ప్రేమ సృష్ఠియంతటిలోను కనబడుచున్నది. మేము మా పిల్లలను ప్రేమించుటకన్న నీవు మమ్మును ప్రేమించుటయే ఎక్కువైయున్నది. మమ్మును కలుగజేసిన నీవు మమ్మును ప్రేమించక యింకేమి చేయుదువు! గనుక నీ ప్రేమను బట్టియే మానవునికి కావలసినవన్నియు ఆలోచించి చేసినావు. ఆ నీ

ప్రేమను బట్టియే సహించుచు, శిక్షించుచు. క్షమించుచున్నావు. మరియు అట్టి నీ ప్రేమను బట్టియే మా పాపములను జ్ఞాపకము చేసికొనను అన్నావు. గనుక నీకు వందనములు.

**4. పరిశుద్ధత:–** పరిశుద్ధుడవైన జనకా! సర్వసృష్టిని, మానవుని, పరిశుద్ధముగానే చేసియున్నావు. పాపప్రవేశమును బట్టి మేము పాపులమైనను, నీ పరిశుద్ధతను బట్టి మరల మాకు పరిశుద్ధత దయ చేయుచూనే యున్నావు. నీవు పరిశుద్ధుడవుగాన దేవదూతలచేత నిత్యము పరిశుద్ధుడవని స్తుతి నొందుచున్నావు. గనుక మమ్మును కూడా పరిశుద్ధపరచి, పరిశుద్ధులుగా నిత్యము నీ సన్నిధిలో నుంచుదువు గాన నీకు మా స్తుతులు.

**5. సర్వశక్తి:–** సర్వశక్తి గల తండ్రీ! నీవు సమస్తము చేయగలవు గాని పాపము చేయలేవు. మా విషయములో ఎంత గొప్ప కష్టమైన పని యైనను, అసాధ్యమైన పనియైనను చేయగలవు. మా కోరికలను నెరవేర్చగల శక్తిగలవాడవు. మేము పడిపోయి మమ్మును లేపుమని అడిగిన యెడల లేవనెత్తగల శక్తిమంతుడవైన నీకు వందనములు.

**6. సర్వజ్ఞాని:–** జ్ఞానివైన తండ్రీ! నీ జ్ఞానము దేవదూతలకు, మనుష్యులకు, జీవరాసులకు ఇచ్చినావు. ఆ జ్ఞానము వలననే మానవులు సృష్టిలోని అనేక మర్మములు తెలిసికొనుచున్నారు. నేననుకొన్నది నెరవేర లేదని నోరు, నెత్తి కొట్టుకొన్నా నాయిష్టము నెరవేర్చవు. కారణము నా జ్ఞానమునకు తెలియదు గాని నీ జ్ఞానమునకు తెలియును. అది నెరవేర్చిన నాకు హాని అని నీ సర్వజ్ఞానమునకు తెలియును. బైబిలులోని సంగతులు తెలియనప్పుడు అనేక ప్రశ్నలు వేసికొని మనస్సు చెడగొట్టుకొందుము. అప్పుడు మా జ్ఞానము మీద ఆనుకొనక నిన్ను అడిగిన తప్పక వివరింతువు గనుక వందనములు.

**ఉదా:-** ప్రభువా! నిన్ను ఎరుగనివారు అంతకు ముందే అనేకులు చనిపోయిరి. వారి సంగతి యేమి? అని నీ సేవకుడు (ఫా॥ యం. దేవదాసు అయ్యగారు) అడుగగా "హేడెస్సులో నేను బైబిలు క్లాసు పెట్టినాను, బోధించుచున్నాను" అని చెప్పినపుడు నీ దాసుడు "Now it is clear Father" (తండ్రీ ఇప్పుడు స్పష్టముగా అర్ధమైనది) అని సంతోషించి, స్తుతించిరి.

**7. జీవము:-** జీవమైయున్న ప్రభువా! నీవు జీవమైయున్నావు. గాన యెప్పుడును పనిచేయుచూనే ఉన్నావు. మాలోని జీవము మా బలహీనతనుబట్టి నిర్జీవ స్థితి లోనికి వచ్చినప్పుడు మాలో నూతన జీవము ధారపోయుదువు. గనుక నేనును నా ప్రార్ధనయు జీవము కలిగియుండును. మరణము వచ్చినను "ఇది మరణము కాదు, 'సరిక్రొత్త జీవనమనగలము' వందనములు.

# దైవలక్షణముల స్తుతి

1) దేవా! నీవు అనాది వ్యక్తివైయున్నావు. నిన్ను ఎవ్వరు కలుగచేయలేదు. నీయంతట నీవే ఉన్నావు. గనుక నీకు వందనములు.

2) దేవా! నీవు వెలుగువైయున్నావు. అందుచేతనే సూర్య, చంద్ర నక్షత్రములకు వెలుగునిచ్చినావు. జీవులలో కండ్లకు వెలుగు నిచ్చినావు. గనుక నీకు స్తోత్రములు.

3) దేవా! నీవు జ్ఞానమై యున్నావు. అందుచేత దేవదూతలకు, మనుష్యులకు జీవరాసులకు జ్ఞానమిచ్చినావు. అట్టి జ్ఞానము వలన అనేక మర్మములు తెలియుచున్నవి. మా జ్ఞానమునకు నీవు బైలుపడినావు గనుక నీకు స్తుతులు.

4) దేవా! నీవు ప్రేమవైయున్నావు. గనుక జీవరాసులు ఒక దానినొకటి ప్రేమించుకొనుచున్నవి. ఆలాగుననే మనుష్యులుకూడ ఒకరి నొకరు ప్రేమించుకొనుచున్నారు. గనుక నీకు స్తుతులు.

5) దేవా! నీవు న్యాయమై యున్నావు. గనుక నీవు క్షమించే వాడవు అయినప్పటికిని తప్పుచేసినవారిని శిక్షించి, క్షమించే వాడవు గనుక నీకు ప్రణుతులు.

6) దేవా! నీవు పరిశుద్ధుడవైయున్నావు. అందుచేత లోకములో పాపమున్నప్పటికిని పరిశుద్ధత కూడా ఉన్నది. వర్షజలములలో, కాయలలో పరిశుభ్రత కనబడుచున్నది. మనుష్యులలో పాపమున్నప్పటికిని పరిశుద్ధత కూడ ఉన్నది. గనుక నీకు నమస్కారములు.

7) దేవా! నీవు శక్తివైయున్నావు. కాబట్టి మానవులకు, జీవరాసులకు శక్తియిచ్చినావు. గనుక వారు నడువగలరు. పనిచేయగలరు. గనుక నీకు మంగళస్తోత్రములు.

8) దేవా! నీవు సర్వవ్యాపివైయున్నావు. అందుచేతనే అన్ని చోట్ల నీ ప్రభావము అనగా నీ ప్రేమ, జీవము, పరిశుద్ధత, నీ పని. నీ కాపుదల కనబడుచున్నవి. గనుక నీకు నిత్యమంగళ స్తుతులు.

9) దేవా! నీవు నిరాకారుడవైయున్నావు. అందుచేతనే పాపులమైన మాకు కనబడవు. కనబడని తండ్రివి అయినప్పటికిని దర్శనములలో కొందరికి స్వప్నములలో కొందరికి కనబడుచున్నావు. గనుక నీకు హృదయ పూర్వక వందనములు.

10) దేవా! నీవు స్వతంత్రుడవైయున్నావు. స్వేచ్ఛాపరుడవై యున్నావు. నీకు ఎవ్వరును సలహానియ్యనక్కరలేదు. అన్నియు నీ యిష్ట ప్రకారమే చేయగలవు. గనుక నీకు హృదయపూర్వక వందనములు.

దేవా! నీ యొక్క దివ్యలక్షణములు దేవదూతలకు. మనుష్యులకు ఇచ్చినావు. గనుక స్తోత్రములు. దేవదూతలలో ఒక దూత పాపములో

పడి నీ సద్గుణములు లేకుండ చేసికొన్నది. అలాగే మనుష్యులు పాపములో పడి నీ గుణములు చాలావరకు పోగొట్టుకొనుచున్నారు. అయినను నీవు వారియెడల దీర్ఘశాంతము కలిగియున్నావు. గనుక నీకు వందనములు మరియు ఓ దేవా! నిన్ను అడిగే వారికి నీ శక్తులు దయ చేయుదువు. గనుక నమస్కారములు. దేవా! నీ ప్రియకుమారుడైన యేసుక్రీస్తును లోకమునకు పంపించి ఆయనలో నీ గుణములు బయలు పర్చినావు. గనుక నీకు అనేక స్తుతులు మరియు దేవా! సృష్టిలోని వస్తువులను పరీక్షించిన నీ సుగుణములు అందులో ఉన్నవి గనుక స్తుతులు. మరియు దేవా! నమ్మినవారిలో నున్న దుర్గుణములు దూరముగా తీసివేసి, మోక్షమునకు చేర్చుకొనుచున్నావు. అక్కడ వారు శాశ్వతముగా నీ దివ్య లక్షణములు అనుభవిస్తున్నారు. గనుక నీకు మంగళస్తోత్రములు.

# 3. దైవలక్షణముల స్తుతి

## (ప్రార్థన మెట్లలోని స్తుతులు)

మనలో దైవలక్షణములును, దుర్గుణములును మిళితమైయున్నవి. గనుక దైవలక్షణ ధ్యానము వలన దుర్గుణ పరిహారము గావించుకొనవలెను. దైవప్రార్థన యీ పనికి మిగుల సహాయకారి.

**1. దైవ వ్యక్తి:-** దేవుడు దేవుడై యుండు లక్షణము. దేవుడు అనగా దివ్యమైనవాడు గనుక అన్నిటికన్న మొదటివాడు. గొప్పవాడు మంచివాడు. దేవుడు నిరాకారుడైనను ఒక వ్యక్తియైయున్నాడు.

**విశ్వాసము, స్తుతి:-** దేవా! నీవు దేవుడవు గనుక మా ఊహకు అందునట్టి అన్నిటి కంటెను గొప్పవాడవు. గనుక నీకనేక నమస్కారములు. నీవు ఉన్నావను తలంపు నీవే కలిగించినావు గనుక స్తోత్రములు.

**2. జీవము :-** దేవుడు జీవము గనుక ఏ పనియు చేయకుండా ఉండలేడు. నరుడు పాపములో పడిపోయిన యెడల అతనిని రక్షింపనైన రక్షించునుగాని మొదలే అతనిని సృజింపకుండ ఉండలేడు. జీవము అనునది తక్కిన లక్షణములలో గూడ ఉన్నది. అట్లే అన్ని లక్షణములుకూడ మిగిలిన అన్ని లక్షణములలో ఇమిడియున్నవి. ఒక దానికొకటి సంబంధించి యున్నవి. ఒకపని చేయవలసి వచ్చినపుడు అన్ని లక్షణములు ఒక్క లక్షణముగా పనిచేయును.

**విశ్వాసము, స్తుతి:-** దేవా! నీవు జీవమై నాలో అనుదినము జీవము కలిగించువాడవై యున్నావు గనుక నీకు స్తోత్రములు. నీవు నాలో ధారపోసిన జీవమునకు శక్తితగ్గినపుడు నా జీవమును బలపరచు వాడవైయున్నావు. గనుక నీకు స్తోత్రములు. నరులకు జీవమును బలపరచు వాడవైయున్నావు. గనుక నీకు స్తోత్రములు. నరులకు జీవము పూర్తిగా పోయి మరణము కలుగునుగాని కొన్ని యేండ్లకు మరల నీవు బ్రతికింతువు, జీవము కల్గింతువు గనుక నీ కనేక స్తోత్రములు. శరీర జీవమునకు మాత్రమేగాక ఆత్మజీవమునకు గూడ నీవే ఆధారమై యున్నావు. నేను ఆత్మజీవన విషయములో తగ్గినప్పుడు నాలో మరల నూతన జీవము ధారపోయుదువు. గనుక నీకు స్తోత్రములు. నాకు పరలోకములో నిత్య జీవము కలిగించుటకు నాలో దానిని ఇక్కడే ప్రారంభించినావు గనుక నీకనేక స్తోత్రములు. నీవు అనంత కాలము పొడవున జీవించుచునే యుండు రీతిగా నేనును నీతో జీవించుచునే యుండగల కృప నాకు దయచేసినావు గనుక నీ కనేక స్తోత్రములు.

**3. ప్రేమ:-** దేవుడు ప్రేమయైయున్నాడు గనుక మనమెన్ని తప్పులు చేసినను క్షమించుచున్నాడు. మనము పుట్టకముందే మనకు కావలసిన వన్నియు దయచేసియున్నాడు. అన్నియు మనకు యిచ్చి వేయుటయే ఆయన ప్రేమయొక్క లక్షణమైయున్నది.

**విశ్వాసము, స్తుతి:-** దేవా! నీవు ప్రేమా స్వరూపివై యున్నందుకు నీ కనేక వందనములు. ఓ తండ్రీ! నీవు ప్రేమవు గనుక నన్ను కలుగ జేయకుండ ఉండలేక పోయినావు. నీ సన్నిధి భాగ్యము నేను నిత్యము అనుభవింపవలెనని కోరి నన్ను సృజించినావు గనుక నీ కనేక వందనములు. నామీద నీకున్న ప్రేమను బట్టి నేను జన్మింపక ముందే నాకు కావలసిన వన్నియు కలుగచేసియుంచినావు. నీకు నాయందు అధికమైన ప్రేమ గనుక రక్షణార్ధమై భూలోకమునకు నరావతారిగా ప్రత్యక్షమైనావు గనుక నీ కనేక వందనములు. ఈ సందర్భమున "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను" అని చదువుకొని ఆనందించుచున్నాను. నీవు ప్రేమగల వాడవని బాగుగా గ్రహించునట్లు మనుష్యులలో మనుష్యులకు, జీవ రాసులలో జీవరాసులకు ప్రేమ కలిగించినావు. నీ ప్రేమాది సద్గుణములు నీ వాక్యములో బయలుపరచి నీ ఆత్మచేత బోధపరచుచున్నావు గనుక నీ కనేక వందనములు.

**4) న్యాయము:-** దేవుడు న్యాయవంతుడు గనుక ప్రకృతి ధర్మమునకు భిన్నముగ ఏదియు చేయడు. రెండు ఐదులు పది. దీనిని తొమ్మిదిగా మార్చుమని అడిగిన యెడల మార్చడు. అట్లు మార్చిన సృష్ఠి క్రమమునకు విరుద్ధమగును. దేవుడు న్యాయస్థుడు గనుక బహుమా నములను శిక్షలను నరులకు నిర్ణయించుటలో ధర్మానుసారముగానే నిర్ణయించును.

**విశ్వాసము. స్తుతి:-** ఓ దేవా! నీవు న్యాయ స్వరూపివైయున్నావు. గనుక నీ కనేక స్తుతులు. నీవు న్యాయమైయున్నందున నేరస్థులను శిక్షించు చున్నావు. నీవు న్యాయస్థుడవై యున్నందున ఎంత పాపియైనను ప్రార్థించి నప్పుడు, ప్రార్థించినాడు గనుక రక్షించుట న్యాయమే అని చెప్పి రక్షించు చున్నావు. నీకనేక స్తుతులు. నీవు న్యాయస్థుడవు గనుక ఎవరికి ఏస్థితి

అనుగ్రహింపవలెనో ఆ స్థితి అనుగ్రహించుచున్నావు. ఎవరికి ఏమి దయ చేయవలెనో అవి దయచేయుచున్నావు. గనుక నీకనేక స్తుతులు, నీవు అన్యాయము చేయజాలవు గనుక నీ కనేక స్తుతులు. లోకములో చెడుగు కష్టములు కలుగుటయు చూచి నీవు ఊరుకొనుచున్నావు. ఇది న్యాయమే. ఎందుకనిన నరులకు స్వతంత్రత ఇచ్చియున్నావు. అడ్డము వెళ్ళవు. మరియు పాప శిక్షార్థమై న్యాయపు తీర్పు దినమొకటి యేర్పరచినావు నరులు నీ తట్టు తిరుగగలందులకు కావలసినంత గడువు దయచేయుచున్నావు. ఈ కారణముచేత నీవు ఊరుకొనుచున్నావు. కాబట్టి నీ కనేక స్తుతులు. నరులకు జ్ఞానాభివృద్ధియు, మార్పును కలిగించు నిమిత్తమై కష్టకాలమున ఊరుకొను చున్నావు. గనుక నీకనేక స్తుతులు..

**5. శక్తి:-** దేవుడు శక్తిమంతుడు కనుక సమస్త కార్యములు చేయగలడు. ఆయనకు అసాధ్యమైనది ఏదియులేదు. దేవుడు పాపము చేయగలడా? అని ఒకరు ఒక క్రైస్తవ బోధకుని అడిగిరి. అందుకాయన చేయలేడని జవాబు చెప్పిరి. అప్పుడు ఆ ప్రశ్నకుడు అలాగైతే దేవుడు సర్వశక్తి గలవాడని అనకూడదు అని పల్కెను. అందుకా బోధకుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. పాపముచేయుట పరిశుద్ధత నుండి పడిపోవుటయై యున్నది. పడిపోవుట కూడా ఒక శక్తియేనా? ఒకరు పైనుండి పడిపోవుట చూచినపుడు అతడు మహాశక్తిగలవాడు గనుకనే పడిపోయినాడు అందురా?

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! నీవు శక్తి మంతుడవైయున్నావు గనుక నిన్ను కొనియాడుచున్నాను. ఓ తండ్రీ! నీవు శక్తి మంతుడవు గనుకనే ఇంత గొప్ప భూమండలమును అంతగొప్ప ఆకాశమును కలుగ జేసినావు. గనుక నిన్ను కొనియాడుచున్నాము. ఓ తండ్రీ! నా విషయమై నీవు చేయలేని పని ఏదియు ఉండదు గనుక నిన్ను కొనియాడుచున్నాను. నేను చెడిపోయి అధో:లోకమునకు వెళ్ళినను నీవు నన్ను అక్కడినుండి

రక్షింపగల శక్తిమంతుడవు గనుక నిన్ను కొనియాడుచున్నాను. నేను చేయలేని పనులు నాతో చేయింపగల శక్తి మంతుడవైయున్నావు. గనుక నిన్ను కొనియాడుచున్నాను. నాకు కావలసినవన్నియు తెచ్చిపెట్టగల శక్తి మంతుడవు. నాకు అక్కర లేనివి. నన్ను బాధించునవి పరిహారము చేయగల శక్తిమంతుడవు. నేను మోక్షమునకు ఎగిరి రాలేను. అయినను నన్నక్కడికి తీసికొని వెళ్ళగల శక్తిమంతుడవు. ఇవన్నియు తలంచుకొని నిన్ను నా మనస్సులో కొనియాడుచున్నాను.

**6) జ్ఞానము:-** దేవుడు జ్ఞానస్వరూపియై యున్నాడు. అందుచేత ఆయనకు అలోచన చెప్పగలవారెవరును లేరు. నవీనకాల మానవులు తమ జ్ఞానమును ఎంత ఎక్కువగా వృద్ధిచేసికొన్నారో నూతన కల్పనలను బట్టి తెలిసికొనగలము. మానవ జ్ఞానమే ఇంత గొప్పదై యుండగా మానవులు కట్టి జ్ఞానమిచ్చిన దేవుని జ్ఞానమెంత గొప్పదై యుండును! దేవుని జ్ఞానము ఎంత గొప్పదో తెలిసికొనుటకై మన అందరి జ్ఞానమంతయు ఉపయోగించినను తెలిసికొనజాలము. వస్తువు వంటి వస్తువులేదు. మనిషి వంటి మనిషిలేడు. జంతువు వంటి జంతువులేదు. చెట్టు వంటి చెట్టులేదు. ఇది అధిక పరీక్ష వలన తెలియగలదు. "ఆహా! దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము, ఆయన తీర్పును శోధింపనెంతో అశక్యములు. ఆయన మార్గము లెంతో అగమ్యములు. ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పినవాడెవడు? ముందుగా ఆయనకిచ్చి ప్రతిఫలము పొందగలవాడెవడు? ఆయన మూలమునను, ఆయన ద్వారాను, ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి. యుగముల పర్యంతము ఆయనకు మహిమ కలుగునుగాక!" (రోమా 11:33-36) ఆమేన్.

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! నీవు జ్ఞానరూపివి. అందుచేత నాకెంతో ఆనందము. నా తెలివి తక్కువ తనము వలన నేనేదైన యొకపని

చేయుచున్నప్పుడు నీ జ్ఞానదీపముతో నాకొద్దిపాటి జ్ఞానమును వెలిగించి, నాచేత జ్ఞానయుక్తమైన పనులు చేయింతువు. గనుక నాకెంతో ఆనందము. నీవు సర్వలోకమును కలుగజేసిన సృష్ఠిచరిత్ర చూడగా ఎంతో గొప్ప క్రమము కనబడుచున్నది. నరులకు కావలసినవన్నియు మొట్టమొదట సృజించి పిమ్మట నరుని చేయుటలో నీ జ్ఞాన లక్షణములోని గొప్ప క్రమము కనబడుచున్నది. నీవు మొదట చేయవలసినవి పిదప, పిదప చేయవలసినవి మొదట చేయలేదు. ఎప్పుడు యేదిచేయవలెనో అప్పుడది చేసినావు. గనుక నాకెంతో ఆనందము. చేసిన వస్తువులను ఎక్కడ ఏమి అమర్చవలెనో, అక్కడ అవి అమర్చినావు. అడవిలో నుండవలసినవి అడవిలోను, సముద్రములో ఉండవలసినవి సముద్రములోను ఉంచినావు. వస్తువులను అమర్చుటలో నీ జ్ఞానము కనబడుచున్నది. నీ జ్ఞాన కార్యమువల్ల నా కెంతో ఆనందము.

**7) పరిశుద్ధత:-** పాపపుణ్యములు దేవుడే కలిగించినాడని కొందరు దురభిప్రాయపడుచున్నారు. పరిశుద్ధుడైన దేవుడెట్లు పాపము చేయగలడు? ఒకవేళ దేవుడేకాని పాపము చేసిన యెడల ఆయన పాపులందరికంటే పాపియగును. పాపియైతే దేవుడెట్లు కాగలడు? వెలుగు చీకటిగాను. చీకటి వెలుగుగాను ఉండగలదా!.

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నీవు పరిశుద్ధుడవు గనుక సమస్తమును పరిశుద్ధముగానే సృజించినావు. నీకు స్తోత్రార్పణములు. పాపినైన నన్ను పరిశుద్ధునిగ జేతువు. తుదకు నన్ను ఈ పాపలోకము నుండి తప్పించి పరిశుద్ధ స్థానమగు మోక్షలోకమునకు చేర్చెదవు గనుక స్తోత్రార్పణములు. పరిశుద్ధుడవైన తండ్రీ! నీవు పరిశుద్ధుడవు గనుక పాపమును అసహ్యించుకొందువు. అయినను పాపిని కనికరింతువు గనుక నీకు స్తోత్రార్పణలు. కడవరి తీర్పు అయిన తరువాత నీవు ఈ

పాపలోకమును పరిశుద్ధ లోకముగా మార్చి లోకములో నొక భాగముగా జేర్చెదవు. గనుక అనేక స్తోత్రార్పణలు. ఆ తర్వాత భూలోకములో శేషించి యుండువారు. పాపమెరుగనివారై యుందురు. అందుచేతను నేడు మోక్షములో నున్నవారు పాపమెరుగనివారై యుందురు. అందుచేతను నీకు స్తోత్రార్పణలు. పరిశుద్ధుడా! పరిశుద్ధుడా! త్రికాలములందు, సర్వస్థలములందు, రక్షితులందరి యందు నీవే స్తోత్రార్పణకు పాత్రుడవు.

నీవు పరిశుద్ధుడవు గనుక పాపము కలుగజేయలేదు. నీకు స్తోత్రార్పణలు. పాపమునకైనను పాప ఫలితమునకైనను సృష్టి కర్తవు కానట్టి తండ్రీ! పరిశుద్ధతకు మాత్రమే సృష్టి కర్తవై యున్న తండ్రీ! నీకు నిత్యానంద స్తోత్రార్పణలు.

**8) స్వతంత్రత:–** దేవుడు సర్వ స్వతంత్రుడు. గనుక ఆయన ఒకరి ఇష్టమును అనుసరింపనక్కరలేదు. ఒకరిమీద ఆనుకొని యుండవలసిన అగత్యములేదు. ఆయనకు పైగా ఎవరులేరు. గనుక ఆయన ఒకరికి లోబడవలసిన పనిలేదు. ఆయన తన ఇష్టాను సారముగా సర్వకార్యములు చేయునప్పుడు అడ్డము అనునదియుండదు.

**విశ్వాసము, స్తుతి:–** ఓ తండ్రీ! నీవు సృష్టిలో స్వాతంత్ర్యము దయచేసినందుకు నాకెంతో మనసానందము. నేను నిన్ను బలవంతముగా ఆరాధింపక నా ఇష్టానుసారముగా ఆరాధింపగలందులకై స్వాతంత్ర్యము అనుగ్రహించినావు. కనుక నీకు నా మనసానంద వందనములు. ఆది తలిదండ్రులకు నీవు స్వాతంత్ర్యమిచ్చి, తోటలోని పండ్లు నిరభ్యంతరముగ తినవచ్చునని సెలవిచ్చినావు. మేమును ఇట్టి సెలవు గలవారమే. సృష్టిలో నున్న సమస్తమును మేము నిరభ్యంతరముగా అనుభవింపవచ్చును. ఇట్టి కృప నిమిత్తమై నీకు నా మనసానంద వందనములు. ఆత్మీయ జీవనములో విశ్వాసులకు సమస్త భాగ్యములను అమర్చి పెట్టి యుంచినావు. అదిలేదు.

ఇదిలేదు అనక సమస్తమును నేను అనుభవింపవలెనని నీవు కోరుకొను చున్నావు. గనుక నీకు నా మనసానంద వందనములు. "సమస్తము మీవి. పౌలైనను, అపొల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను, జీవమైనను, మరణమైనను ప్రస్తుతమందున్న వియైనను, రాబోవునవియైనను, సమస్తమును మీవే మీరు క్రీస్తువారు; క్రీస్తు దేవునివాడు." అని పౌలుచేత వ్రాయించిన మాటలు చదివి ఆనందించు చున్నాను (1కొరింథీ 3:22,23). గనుక నీకు నా మనసానంద వందనములు.

**9) సర్వవ్యాపకత్వము:-** దేవుడు, సర్వవ్యాపియై యున్నాడు. ఆయన లేనిచోటు లేదు గనుక నీవు ఎక్కడేమి చేసినను ఆయనక తెలుసును గనుక జాగ్రత్తగా మసలుకొనుము. నీవాయనకు దాగియుండలేవు. నీవంగీ కరించినయెడల సర్వవ్యాపియైన ఆయన నీకు అన్ని స్థలములలో సహాయము చేయును. క్రీస్తు ప్రభువు శిష్యులు ప్రార్ధన గృహమందు సమావేశమై దైవాత్మ రావలెనని ప్రార్ధించుచుండగా ఆయన వారిలో ప్రవేశించినపుడు యొకధ్వని కల్గెననియు, అది వారు కూర్చుండియున్న గృహమంతయు వ్యాపించియుండెననియు వ్రాయబడియున్నది. (అపో 2:1-4). దైవాత్మ వారి గృహమందు వ్యాపించెను. నీ వంగీకరించిన యెడల నీ హృదయమంతయు ఆయన వ్యాపించియుండును. ఇది నీకు మహానందకరమైన వార్త కాదా!

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నీవు సర్వవ్యాపి వై యున్నందుకు నీకనేక స్తోత్రములు. నేను ఇంటిలో ఉన్నను. బయటనునను, స్థలాంతర మందున్నను, దేవాలయమున నున్నను, పాఠశాలయందున్నను, వృత్తిశాల యందున్నను. నీవు నాయొద్దనే ఉండగలవు. నేను సౌఖ్యస్థలములో నున్నను. అపాయకరమైన స్థలములో నున్నను నీవు నా యొద్దనే ఉండగలవు. గనుక నీకు నా స్తోత్రములు. నేను ఈ లోకములో ఉన్నను. పరలోకమునకు

వచ్చినను నీవు నా దగ్గరనే ఉండగలవు. నేను నిద్రమీద నున్నను. అజాగ్రత్తగా నున్నను, చీకటిలోనున్నను. వెలుతురులో నున్నను, నీవు నాచెంతనే యుందువు గనుక నీకనేక స్తోత్రములు, అనంత లోకములో అనంత దేవుడవైన నీవు అనంతకాలము నాయొద్దనే యుందువనియు, నేను నీ యొద్దనే యుందుననియు తలంచుకొని ఇప్పుడే ఆనందించు చున్నాను. ఇట్టి జీవభాగ్యము నాకు కలుగును. గనుక నీకు నా వందన స్తోత్రములు. నాతోపాటు పరిశుద్ధులును, దేవదూతలును నీ సన్నిధిలో నుందురు. ఈ తలంపు నాకానందముగ నున్నది. నీకు నా వందన స్తోత్రములు.

**10) త్రైక స్థితి:-** దేవుడొక్కడేయైనను మనకు తండ్రిగాను, కుమారుడుగాను, పరిశుద్ధాత్ముడుగాను వాక్యగ్రంథమునందు ప్రత్యక్ష మైనాడు. దేవుని గురించి మాట్లాడునప్పుడు ఒక్కడు ముగ్గురుగాను, ముగ్గురు ఒక్కరుగాను ఉన్నట్లు మాట్లాడుదుము. అయినను దేవుడొక్కడే. ముగ్గురు దేవుండ్లు లేరు. ఆయన ముగ్గురుగా బైలుపడినాడని చెప్పి, ముగ్గురు దేవుండ్లని అన్న యెడల ఆ మూడు అను అంకె దైవవ్యక్తి విషయమై సరిపోదు. తండ్రి సర్వలోకమును కలుగజేసెను. కుమారుడు సర్వలోక పాపభారమెత్తుకొనెను. పరిశుద్ధాత్ముడు సంగతులు వివరించును, జ్ఞానో దయము కలిగించును, శక్తి దయచేయును. ఈ త్రైకమర్మము మనకు అందనిది. గనుక దీనిని గురించి దీర్ఘాలోచన చేయుట మానవలెను. అయినను మనకు బయలుపడిన దానితో సంతుష్టిపడి ఆత్మానందము కల్గించుకొనుట మంచిది. జ్వాల, కాంతి, వేడి ఈ మూడును కలసి దీపమైనది. వీటిలో ఒకటి తీసివేసిన యెడల తక్కిన రెండును అంతరించును. వీటిని మూడు వస్తువులని చెప్పము గాని వస్తువు ఒక్కటే అని చెప్పుదుము. దీనినిబట్టి త్రిత్వమొక్కటేయని గ్రహింపగలము.

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నీవు నా తండ్రివిగాను, కుమారుడవుగాను, పరిశుద్ధాత్మగాను బైలుపడిన మహత్తును, ఒక్కడవైన నీవు ముగ్గురవుగాను, ముగ్గురవైన నీవు ఒక్కడవుగాను ప్రత్యక్షమైన మహత్తును స్మరించి నీకు ఆత్మానంద స్తోత్రములాచరించుచున్నాను. తండ్రీ! నీవు త్రిత్వమైయున్నట్లు మేమును త్రిత్వమైయుండుటకై మాకు ఆత్మను, జీవమును, శరీరమును దయచేసినావు. కనుక నీకు నా ఆత్మానంద స్తోత్రములు.

**11) లక్షణదానము:-** దేవుడు నరులను తన స్వరూపమందు సృజించెనని వ్రాయబడియున్నది. (ఆది. 1:26,27; 5:1) ఆయన స్వరూపమనగానేమి? ఆయన లక్షణములే ఆయన స్వరూపము దేవుడు తన లక్షణములు పెట్టి నరుని చేసెను. తండ్రి లక్షణములు కుమారునికి కలుగుచున్నవి కదా! మనము దేవుని ఎరుగకముందె మన కాయన లక్షణములను దానము చేసెను. దీనిలో దేవుని ప్రేమ కనబడుచున్నది. ఆయన సృజించినవి కూడ మనకు దానము చేసెను. దీనిలో దేవుని ప్రేమ కనబడుచున్నది. ఇందును బట్టి ఆయన ప్రేమను తెలిసికొనుచున్నాము. ఆయన యావత్తు, ఆయన కలుగజేసినది. యావత్తు మనదే కాబట్టి మనము మన హృదయములను కృతజ్ఞతతో నింపుకొనవలెను.

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! నీ దివ్య లక్షణములను మాకు దానముగ నిచ్చిన నీ అత్యధిక కృపకు నీకనేకమైన ఆత్మానంద స్తోత్రములు. నీ పావన లక్షణములకు భిన్నమైన చెడు లక్షణములు మాలో ప్రవేశించినందున నీకును మాకును చాల విచారమే. అయినను నీ దానములకు అపకీర్తి కలుగకుండునట్లును, మేము విచారముచేత నశింపకుండునట్లును. మా దుర్గుణములను పరిహరించునట్టి నీ కుమారుని అమూల్య రక్త పద్ధతి నేర్పరచిన నీ జ్ఞానలక్షణార్థమై నీకు నా ఆత్మానంద స్తోత్రములు. నీవు

మా - కనుగ్రహించిన భూదానములన్నిటి కంటెను నీ లక్షణదానమే - గొప్పది. ఇది తెలిసికొనుటకై యిచ్చిన వాక్యదానము మా హస్తములందున్న గొప్ప దానమైయున్నది. అన్ని దానముల నిమిత్తము నీకు నా ఆత్మానంద స్తోత్రములు. ఆమెన్.

# 4. దైవలక్షణముల స్తుతి

## (ఉపవాస దీక్షలోని స్తుతులు)

1) దేవా! అనాది దేవా! నీకు స్తోత్రములు, నిన్ను ఎవ్వరు కలుగజేయలేదు. నీ అంతట నీవే ఉన్నావు. సృష్ఠింపబడకుండ ఉన్న దేవా! ఈ నీ గొప్పతనమునకు అనేక స్తోత్రములు.

2) అనంత దేవా! నీవు ఎల్లప్పుడు ఉండగల దేవుడవు గనుక నీకు నిత్యమంగళ స్తోత్రములు. నీవు ఎల్లప్పుడు ఉండువాడవు గనుక నీకు అనంత స్తోత్రార్పణలు.

3) నిరాకారుడవైన దేవా! నీకు మహిమ కల్గునుగాక పాపులమైన మేము మా స్థితిని బట్టి నిన్ను చూడలేకపోవుచున్నాము. నీవు మాకు కనబడవు. అయినను నీవు మాత్రము మమ్మును చూచుచున్నావు. గనుక నీకు మహిమ. కనబడని తండ్రివైనప్పటికిని దర్శనములలో కొందరికి, స్వప్నములలో కొందరికి కనబడుచునేయున్నావు. అందుకై నీకు మహిమ. నీవు నిరాకారుడవైనప్పటికిని నాకు ఉపయోగకరమైన శరీరాకారమును నిర్మించినందులకై నీకు మహిమ, మరియు నా ఆత్మకు నిరాకారము దయచేసినావు. అందుచేత ఆకారముగల నాశరీరముతోను.. నిరాకా రముగల నా ఆత్మతోను నిన్ను మహిమ పరచుచున్నాను.

4) జీవమైయున్న దేవా! నాలోని జీవము నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చునప్పుడు, తిరిగి నాలో నూతన జీవము

పుట్టించుటకై నీ జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవధార స్తోత్రములు.

5) శక్తియైయున్న దేవా! నీవు మానవులకు, జీవరాసులకు శక్తి యిచ్చినావు. అందువలన వారు నడువగలరు. పనిచేయగలరు. గనుక నీకు కీర్తి కలుగునుగాక. మరియు నీవు నన్ను నేటి వరకు కాపాడుచు, నడిపించుచు వృద్ధిలోనికి తీసుకొని వచ్చుచున్న నీ శక్తిని తలంచుకొని స్తుతించుచున్నాను. నా విషయములో ఎంత గొప్ప కష్టమైన పనియైనను, అసాధ్యమైన పనియైనను చేసిపెట్టగలవు గనుక నా శక్తి కొలది నిన్ను కీర్తించుచున్నాను.

6) జ్ఞానియైయున్న దేవా! నీ సృష్ఠిలోని దేవదూతలకు, జీవ రాసులకు, మనుష్యులకు జ్ఞానమిచ్చినావు. అట్టి జ్ఞానము వలన అనేక మర్మములు తెలియుచున్నవి గనుక నీకు మహిమ కలుగును గాక! మరియు నా కష్టములు, నా కోరికలు నేను నీకు చెప్పుకొనక ముందే నీకు తెలిసే యున్నవి. గనుక నా కష్టములు తొలగింపగలవు. నా చిక్కులు విడదీయగల జ్ఞానోపాయము నీకు కలదు. మరియు నీ అపరిమిత జ్ఞానమును నా పరిమితి జ్ఞానస్థితితో తెలిసికొనలేను. అయినను నా పరిమిత జ్ఞాన మంతటితో నిన్ను మహిమ పరచుచు స్తుతించుచున్నాను.

7) పరిశుద్ధుడవైన తండ్రీ! నీవు నన్నును, సమస్త సృష్ఠిని పరిశు ద్ధముగానే కలుగజేసినావు. గనుక నీకు ఘనత కలుగును గాక! అయినను పాపప్రవేశమును బట్టి నాకు అపరిశుద్ధత కలిగెను. అయినను నీ పరిశు ద్ధతను బట్టి నాకు తిరిగి పరిశుద్ధత కలుగజేయగలవు. గనుక నిష్కళంకమైన మనస్సుతో నిన్ను ఘనపరచుచున్నాను.

8) ప్రేమారూపివైన తండ్రీ! నిన్ను సంస్తుతించుచున్నాను. నీ దానముల మూలముగాను, నీ సహింపు మూలముగాను, నీ నడిపింపు

మూలముగాను, మా కష్టములు నివారణచేయు నీ క్రియల మూలముగాను, నీవు మాకు చేయు ఉపకారముల మూలముగాను, మాకు నీవు చూపుచున్న ప్రేమను తలంచుకొని నిన్ను స్తుతించుచున్నాము. గాని మా స్తుతి నీ ప్రేమ ఎదుట ఏ మాత్రము? జీవరాసులు ఒకదాని నొకటి ప్రేమించు కొనుట, మనుష్యులు కూడ ఒకరినొకరు ప్రేమించుకొనుట ఎరుగుదుము. మరియు భూలోకమందలి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రేమించకున్న ఎంతో ఎక్కువగా నీవు నన్ను ప్రేమించుచున్నావు. కనుక నా హృదయ మంతటితో కూడిన ప్రేమానంద సంస్తుతులు నీకు సమర్పించుచున్నాను.

9) న్యాయస్వరూపివైన దేవా! నేను పొరపాటులోనున్నప్పుడు న్యాయమైన రీతిగా నన్ను గద్దించి, ప్రేమతో శిక్షించు దేవుడవు. నీ న్యాయమును బట్టి నా మనస్ఫూర్తిగా నీకు ప్రణుతులు చెల్లించుచున్నాను.

10) సర్వవ్యాపివైయున్న తండ్రి! నీవు పరలోకమందును, భూలోకమందును, అన్ని స్థలములలో, అన్ని వేళలలోను ఉండగల వాడవు గనుక నీకు స్తుతులు. నేను ఎక్కడ ఉన్నను నీవు అక్కడ ఉందువు. ఉండగలవు. నీవు నా జతగా నుండి నాకు సహాయము చేయగలవు. నేను ఒంటరిగా నున్నానను చింత లేకుండ చేయగలవు. అందువలన నా మనస్సంతటితోను, హృదయమంతటితో ను కృతజ్ఞతతో కూడిన స్తుతులు నీకు చెల్లించుచున్నాను.

11) స్వతంత్రుడవైన ప్రభువా! సమస్త కార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ! నీకు మంగళార్చ ఎవ్వరును నీకు సలహా ఇవ్వ నక్కరలేదు. అన్నియు నీ యిష్టప్రకారమే చేయగలవు. నీ మీద ఆధారపడి నాలోని స్వతంత్రతను బట్టి నా కార్యములు చేసికొనగల స్థితి అను గ్రహించినావు. గనుక నేను స్వతంత్రముగా నిన్ను కొనియాడుచు మంగళార్చ పాడుచున్నాను.

12) వెలుగైయున్న దేవా! సూర్య, చంద్ర, నక్షత్రములకు వెలుగు నిచ్చినావు. జీవులలో కండ్లకు వెలుగునిచ్చినావు. అందువలన కృతజ్ఞతతో కూడిన వందనార్పణలు అర్పించుచు కీర్తించుచున్నాను.

నాకు శరీరమును అనుగ్రహించిన దేవా! నీకు స్తుతులు. ఈ శరీరము పాపశరీరమైనందున దీనిని పరిశుద్ధ శరీరముగ మార్చుచున్నావు. తుదకు నాకు మహిమ శరీరము యిచ్చి నీ యొద్దకు తీసుకొని వెళ్ళుదువు. గనుక నీకు మహిమ, ఘనత, కీర్తి, ఆర్భాటము, సంకీర్తనము కలుగును గాక.

దేవా! నీ దివ్యలక్షణములు దేవదూతలకు, మనుష్యులకు యిచ్చినావు. గనుక నీకు ఆర్భాటము కల్గును గాక. మరియు సృష్టిలోని వస్తువులు పరీక్షించిన నీ సుగుణములు అందులో నున్నవి గనుక నీకు మంగళ స్తోత్రములు. ఆమేన్.

# దైవలక్షణముల స్తుతి

## (ఉపవాస ప్రార్థన ప్రకరణములోనివి)

**1. ప్రేమ:-** తండ్రీ! నీవు ప్రేమయైయున్నావు. నీవు ప్రేమవై యున్నందుకు స్తోత్రములు. నీలోని లక్షణములను మానవులమైన మేము అనుభవించుటకు వాటితో మనుష్యులను కలుగజేసియున్నావు. కాబట్టి నీకు స్తోత్రములు. మేము పుట్టక ముందును. నిన్ను ప్రేమింపక ముందును నీవు మమ్ములను ప్రేమించినావు స్తోత్రములు. మేము పాపులమై యుందుమనియు అవిధేయులమై యుందుమనియు నీకు ముందే తెలిసినప్పటికిని నీవు మమ్మును ప్రేమించుచున్నావు. మామీద నీకున్న ప్రేమను చూపించుటకొరకు నా విషయమై దేవదూతలను పరిచారకులుగాను భూమిని నివాస

స్థలముగాను కలుగజేసినావు గనుక నీకు స్తోత్రములు. మాకు కావలసిన వన్నియు ముందే కలుగజేసినా మ స్తోత్రములు. మేము చెడిపోతే రక్షించుటకు నీ ప్రియకుమారుని పంపించినావు స్తోత్రములు. నీ కుమారుని ఇచ్చుటవల్ల మాకు సమస్తమును యిచ్చివేసినావు. నీకు స్తోత్రములు. మేము నీ ప్రేమకు ఏమి చెల్లించగలము? ఓ ప్రేమగల తండ్రీ! ఓ కటాక్షము గల తండ్రీ నీ ప్రేమ లక్షణములకు, నీ ప్రేమ క్రియలకు, నీ ప్రేమ పిలుపునకు నీ ప్రేమ సహవాసమునకు, నీవు బైబిలులో వ్రాయించిన ప్రేమగల మాటలకు అనేక స్తోత్రములు. మేము కష్టములలోను యిబ్బంది లలోను, శోధనలలోను, మాకు వెంటనే సహాయము కలుగక పోవుట చూచి, నీవు ప్రేమలేని వాడవని పొరపాటు అనుకొనే బలహీనులమై యున్నాము. నీ ప్రేమను మేమ గ్రహించకపోవుట మా తప్పైఅయి యున్నది. నీ ప్రేమ యొక్క ఎత్తయిన వెడల్పయినను గ్రహించలేము. ఇంత గొప్ప ప్రేమతో మమ్ములను ఆవరించుకొనుచున్న తండ్రీ! నీకు స్తోత్రములు. ఈ మా స్తోత్రములను నీ ప్రియ కుమారుడును, మా ప్రభువైన యేసు పరిశుద్ధ సముఖమున చెల్లించుకొనుచున్నాము.

**2. సర్వశక్తి:–** సర్వశక్తిగల దేవా! నీవు చేయలేనిది ఏదియు లేదు. అందుచేత నిన్ను స్తుతించుచున్నాను. నా విషయమై నీవనుకొన్నది తుది వరకు నెరవేర్చుకొనే శక్తి గలవాడవైయున్నావు. నీకు స్తోత్రములు. మేము ఏమి ప్రార్థింతుమో అవి నేరవేర్చగల తండ్రివి గనుక స్తోత్రములు. మా ఊహకు మించిన నీ సహాయము మాకు దయచేయు తండ్రివి. నీకు స్తోత్రములు. పాపమునకు సంబంధించినది నీవు చేయలేవు. కాబట్టి నీవే సర్వశక్తిగలవాడవై యుందువు. స్తోత్రములు. మరియు నేను పాపములో పడకుండ సహాయము చేయు తండ్రివి. నీవు నా విషయమై పనిచేయు సమయములో, నీ సర్వశక్తిని ఉపయోగించువాడవని ఒప్పుకొనే కృప దయచేయుము. నాలో ఉన్న బలహీనతను చూడక నీ యందున్న బలమును

చూచే కృప దయచేయుము. నీ శక్తి నా బలహీనతను హరింప చేయుననియు, నీ శక్తి బయలుదేరుననియు, తుదకు నీ శక్తి వల్లనే మేము రక్షింపబడుదు మనియు నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము.

**3. సర్వన్యాయము:–** దేవా! నీ యందు జీవించేవారి విషయములో సహాయము చేయుటచే న్యాయకార్యము జరిగించుచున్న నీకు స్తోత్రములు. ఎవరు నిన్ను ప్రార్థింతురో, ఎవరు నీ వాక్యానుసారముగా ప్రవర్తింతురో, ఎవరు నీకు విధేయులైయుందురో, వారికి నీవు ఎల్లప్పుడు ఉపకారము చేయుచు, నిన్ను నీవు బయలుపర్చుకొందువు. న్యాయస్తుడవైన దేవా! నేను ఎరిగిన నీ న్యాయ స్వభావము యొక్క ఉద్యోగము నిమిత్తమై నీకు స్తోత్రములు, "నా యొద్దకు వచ్చువారిని నేనెంత మాత్రము త్రోసి వేయను" అనే అమూల్య వాగ్ధానమును తలంచుచు నిన్ను స్తుతించు చున్నాను. 'న్యాయస్థుడైన దేవుడే నా తండ్రియై యున్నాడు. కాబట్టి మాకు కావలసినవి తప్పకుండా యిచ్చునను' న్యాయమైన విశ్వాసము దయ చేయుము. ఓ దయగల తండ్రీ! నీవు పరిశుద్ధమైన న్యాయము గల వాడవు. గనుక నీ ఆజ్ఞలు మీరే వారిలో నీ బిడ్డలమైన మేము ఉన్నప్పటికిని తద్వారా కలుగ వలసిన కష్టములు మా మీదికి వచ్చుట చూచి ఊరుకొనుట అను న్యాయ కార్యము జరిగించినందులకై నీకు స్తోత్రములు. దయగల తండ్రీ! మాకు కష్టములు రానిచ్చి ఆ కష్టములలో నీ ఆజ్ఞలు బోధించి, దాని చొప్పున మేము నడుచునట్లుచేసి, అట్లు నడచి నామని మెచ్చుకొని, బహుమానమిచ్చే న్యాయమైన తండ్రివని నిన్ను స్తుతించుచున్నాను.

**4. సర్వాధికారి:–** సర్వాధికారివైన దేవా! నీవు ఏమి సృజించినావో, దానియంతటి మీదను నీకు పూర్ణాధికారము కలిగియున్నందున నీకు స్తోత్రములు. నా మీద కూడ నీకు సర్వాధికారము కలిగియున్నందున నీకు స్తోత్రములు. నేను నీ అధికారమునకు ఆనందించుచున్నాను. అంగీకరించు

చున్నాను. నీకు నా మీద అధికారమున్నందువల్ల, అపవాదికి గాని, అతని సంబంధికులకుగాని నామీద యేవిధమైన అధికారము లేకుండ చేయుచున్నందుకు నీకు స్తోత్రములు. సర్వాధి కారియగు దేవా! అధికారము నీదే. గనుక నాయిష్ట ప్రకారము నేను నడువక నీ యిష్ట ప్రకారము నడిచే భాగ్యము కలుగునని నేను ఆనందించు చున్నాను. నీ అధికారమే నాకు లేనియెడల నా యిష్టాదికారము చెల్లుబడి కాక, ఎన్నో చిక్కులలో పడుదును. అట్టిది జరుగకుండునట్లు నీ సర్వాధి కారమునకు 'చిత్తము ప్రభువా! అనుచు నీకు వందనములు అర్పించు చున్నాను.

**5. దైవ వ్యక్తి:–** దేవా! నీవు దేవుడవై యున్నందుకు స్తోత్రములు. నీవు దేవుడవు గనుక అన్ని లోకముల కంటె గొప్పవాడవు. అందరికంటె గొప్పవాడవు. అందరికంటె, అన్నిటికంటె నీవు శ్రేష్ఠుడవు కనుక స్తోత్రములు. తండ్రివైన దేవా! మా దృష్టిలో ఏది గొప్పదై ఉన్నదో అది మాకు గొప్పదికాదు. నీవే గొప్ప గనుక నీకనేక స్తోత్రములు. అన్నిటికంటే నీవే పైగా వున్నావు. అందుకు నీకు స్తోత్రములు. నీవట్లు బయలుపడినందుకు స్తోత్రములు. దేవాది దేవుండ్లని మనుష్యులనుకొనే దేవుండ్ల కంటే గొప్పవాడవైన దేవా! నీ కనేక స్తోత్రములు. మేమేది చూచుచున్నామో. మాకు ఏది కావలెనో మేమేది యెరుగుదుమో. మేమేది పొందియున్నామో, మనుష్యులందరు ఏమి యెరుగుదురో, ఏమి తెలిసికొందురో, యేమేమి క్రొత్త క్రొత్తగా కనిపెట్టుచున్నారో వాటన్నిటికంటే గొప్ప వస్తువు నీవైయున్నావు గనుక స్తోత్రములు. అన్నియు లేకపోయిన, నీవు ఒక్కడవే ఉంటే మాకు అన్నియు ఉన్నట్లే. నీ విచ్చిన అన్నిటిని చూచునప్పుడెల్ల నీవే మాకు జ్ఞాపకము వస్తావు. నీకు స్తోత్రములు. ఎందుకంటే ఆ వస్తువు కంటే ఆ వస్తువును పుట్టించిన నీవే గొప్ప వాడవు గనుక స్తోత్రములు.

దేవా! నీవు మా ప్రభువువైయున్నావు. అందరికి ప్రభువువై యున్నావు. ఏలుబడి నీదై యున్నది. మా మీద నీవు ప్రభువువై యున్నావు.

గనుక మమ్ములను నీ మార్గములలో, నీ నీతి మార్గములలో నడిపించెదవు. మేము నీ ప్రజలమైయున్నాము. నీ యేలుబడిలో క్షేమము, శాంతి, సంతోషము పొందుదుము. అంజూరపు చెట్ల క్రిందను. ద్రా క్షచెట్ల క్రిందను ప్రజలు నిర్భయముగా బ్రతికిరని సొలోమోను రాజ్యనివాసులను గూర్చి చెప్పబడిన మాట వాస్తవమైతే (1 రాజు 4:25) ఓ ప్రభువా! ఓ దివ్య ప్రభువా! ఓ దైవవ్యక్తి లక్షణముగల ప్రభువా! ఓ మహాప్రభువా! నిన్ను గూర్చియు, నీ యేలుబడిని గూర్చియు మరింత వాస్తవమైయున్నది.

**6. పరిశుద్ధత:–** తండ్రివైన దేవా! నీవు పరిశుద్ధుడవైయున్నావు. నీవు యెంత పరిశుద్ధుడవై యున్నావో ఎవరునూ గ్రహింపలేరు. ఎన్నడు పాపము ఎరుగ నటువంటి పరిశుద్ధులైన దేవదూతలు సహితము నీ పరిశుద్ధత యెదుట ఉండలేక, చూడలేక రెండు రెక్కలతో ముఖమును కప్పుకొన్నారని ( యెషయా 6:25) వ్రాయబడి యుండగా, నీ పరిశుద్ధత ఎంత గొప్పదో యిందులో చూచుచున్నాము. మహాపరిశుద్ధుడా! అత్యంత పరిశుద్ధుడా! నీకు స్తోత్రములు. నిన్ను ఏమని స్తుతింపగలము? మేము ఎంత బాగుగా స్తుతి చేసినను దానిలో ఏదో ఒకచోట లోపముండును. మా హృదయములు ఎంత శుద్ధిగా ఉన్నను, ఎక్కడైన ఒకచోట అపవిత్రత ఉండును. నీ పరిశుద్ధత యెదుట, యే పరిశుద్ధత పరిశుద్ధత అనిపించుకొన గలదు. నీ కాంతి యెదుట నీ పరిశుద్ధమైన కాంతి యెదుట సూర్యకాంతి. చంద్రకాంతి కాదని (ప్రకటన 21:23లో) వ్రాయబడియుండగా, నీ పరిశుద్ధతను గూర్చి ఎట్లు స్తుతించగలము? మహా పరిశుద్ధుడవైన తండ్రీ! నీలో మేము ఏమి లోపములు కనిపెట్టగలము? మా విషయములో నీకున్న ప్రేమ ఎంత పరిశుద్ధమైనదో ఏమి చెప్పగలము? గనుక నీకనేక స్తోత్రములు. నీవు పరిశుద్ధుడవు గనుక సర్వలోకమును పరిశుద్ధమైన రీతిగా కలుగజేసినావు. నీకు స్తోత్రములు. నీవు పరిశుద్ధుడవు గనుక న్యాయము చొప్పున మేము నిన్ను పరిశుద్ధతతో స్తుతించవలసినది. గాని

ఏమి చేయగలము! చేయలేము. మేము చేయగల్గుచున్నదేదో అదే అంగీకరించుమని వేడుకొనుచున్నాము. మహా పరిశుద్ధుడవైన దేవా! నీవెంత పరిశుద్ధుడైనప్పటికిని అపరిశుద్ధమైన ఈ లోకమునకు నరావతారిగా వచ్చినావు. గనుక స్తోత్రములు. అంత మాత్రముచేత నీ పరిశుద్ధతకు లోపము కలుగలేదు. సూర్యరశ్మి అపవిత్ర స్థానములపై ప్రకాశించినను, దాని కళకు కళంకము కలుగదు. నీ పవిత్రత. అపవిత్రత దగ్గరకు వచ్చినను యే మాత్రము తగ్గదు. ఓ దేవా! నీవు పాపులతోను, సుంక రులతోను కూర్చుని భుజించినను నీవు పరిశుద్ధుడవే. అపరిశుద్ధురాలైన స్త్రీ వచ్చి నిన్ను ముట్టగా, నీవు ముట్టనిచ్చినప్పటికిని నీవు పరిశుద్ధుడవే. మహా పరిశుద్ధుడవైన దేవా! నీవు దేవుడవుగానున్నప్పుడు మాత్రమేగాక మా శరీరమును ధరించుకొన్నప్పుడు కూడ నీవు పరిశుద్ధుడవే. నీలో నేరమున్నదని ఎవరు ఋజువు చేయగలరు? నీ క్రియలు పరిశుద్ధ క్రియలై యున్నవి. మహా పరిశుద్ధుడా! నీవు సృజించిన క్రియలు పరిశుద్ధములై యున్నవి. అవి మాత్రముగాక నీవు మమ్ములను రక్షించుటకై సృష్టిలో భూమి మీద చేసిన క్రియలు కూడ పరిశుద్ధమైనవి. అవి మాత్రమే కాక మమ్ములను రక్షించుటకై నీవు నడిచిన క్రియలు కూడ పరిశుద్ధమైనవి. అవి మాత్రమే గాక నీవు చేసిన బోధలు పరిశుద్ధమైనవి. అవి మాత్రమే. గాక నీవు పొందిన శ్రమలు పరిశుద్ధమైన రీతిగా అనుభవించిన శ్రమలై యున్నవి. వీటన్నిటిని బట్టి నీవు పరిశుద్ధుడవని బయలుపర్చుకొనుచున్నావు. గనుక స్తోత్రములు. ఓ పరిశుద్ధుడవైన యేసుక్రీస్తు ప్రభువా! లోకరక్షకులని మానవులు చెప్పుకొనే రక్షకులందరికంటే నీవే మొదటివాడవు. నీవే పరిశుద్ధుడవు. నీవే రక్షకుడవు గనుక స్తోత్రములు. ఓ పరిశుద్ధుడవైన రక్షకా! నీవు పాపములేని వాడవును, పరిశుద్ధుడవును, అయి ఉన్నందు వల్ల అందరిని రక్షించగలవు. నన్నును రక్షించగలవు. గనుక స్తోత్రములు. మహా పరిశుద్ధుడవైన నీ కాంతిని రెండవమారు నీ రాజ్యములో చూచి. మేమెంతగా ఆనందింతుమో, ఆశ్చర్యపడుదుమో నీకు స్తోత్రములు.

పరిశుద్ధుడవైన పరిశుద్ధుడా! దైవాత్మవైన పరిశుద్ధుడా! జీవాత్మవైన పరిశుద్ధుడా! మోక్షపావురమైన పరిశుద్ధుడా! ఓ పరిశుద్ధమైన దేవా! నీవు కేవలము పరిశుద్ధుడవైనందుకు స్తోత్రములు నీ పరిశుద్ధతను గూర్చి నీవు మాకు యెంత బయలుపర్చినా కొంత మాకు తెలుసుగాని, యెక్కువ తెలియదు. తెలిసినదంతయ మహాపరిశుద్ధమైనది. గనుక నీకు స్తోత్రములు. అగ్ని నాలుకలుగు ప్రత్యక్షమగు దేవా! అగ్ని నాలుకలు పరిశుద్ధమైనవై యుండగా నీవెంత కాంతి కలవాడవో మేమేమి చెప్పగలము? నిత్యము ప్రకాశించే ఆత్మవైన ఓ దేవా! నీవు మా హృదయములోనికి వచ్చుటకు మాత్రము సందేహించవు. నీవు పరిశుద్ధుడవని చెప్పి పాపులమైన మాలో నివసించుటకు అసహ్యించుకొనవు. నీది ఎంత గొప్ప పరిశుద్ధత! నీది ఎంత అరమరలేకుండా యుండే పరిశుద్ధత పరిశుద్ధుడా! నీకు పరిశుద్ధ మైన వందనములు. తండ్రి యొద్ద నుండి కుమారుని యొద్ద నుండి వచ్చిన ఓ పరిశుద్ధాత్మ దేవా! యిదివరకున్న హృదయమనే వస్తువు నేటికి కొంత మెరుగైన వస్తువుగా మార్చి ఓ దేవా! ఇక మీదట ఈ వస్తువునకెంత మెరుగు పెట్టుదువో ఎవరు ఎరుగగలరు? మేము మహిమలోనికి వచ్చిన తరువాత మమ్మున ఎంత చక్కని వస్తువుగా మార్చెదవో మేము గ్రహించలేము. నీవు మార్చిన హృదయములే పరిశుద్ధములైయుంటే నీ వెంత పరిశుద్ధు డవో ఎవరెరుగుదురు? ఓ పరిశుద్ధ దేవా! నీ కార్యములు పరిశుద్ధమైనవి. నీ మార్పు అద్భుతము. నీ వెలిగింపు నూతనమైన సృష్టియైయున్నది. పరిశుద్ధుడా! నీకు పరిశుద్ధమైన స్తోత్రములు ఓ పరిశుద్ధాత్మ దేవా! సృష్టి కాలమందే సృష్ఠి అంతటి మీద రెక్కలు చాచి కాపాడుచున్న ఓ దైవాత్మా! కడవరి రోజులలో "ప్రభువైన యేసూ రమ్ము" (ప్రకటన 22: 20) అని సంఘములు చేయచున్న ప్రార్ధనకు సహాయము చేయుచున్న తండ్రీ! నీకు స్తోత్రములు.

**7. సర్వవ్యాపకత్వము:-** ఓ దేవా ! నీవు సర్వవ్యాపివైయున్నావు గనుక స్తోత్రములు. నీవే సర్వమును సృజించుచున్నావు. గనుక సమస్తముండే

చోట నీవున్నావు. నీవు కలుగజేసిన వాటిలో దేనికైనను నీవు వేరుగాను దూరముగాను ఉండవని మేమెరుగుదుము. నీవు పరలోకమందును. భూలోకమందును అన్ని స్థలములలో నుండగలవాడవు. గనుక స్తోత్రములు. నేను యెక్కడ వున్ననూ నీవు అక్కడ నుండగలవు. నీవు నాకు జతగా నుండగలవు. ఉండి నాకు సహాయము చేయగలవు. గనుక నేను ఒంటరిగా ఉన్నాను అను చింతలేకుండా చేయగలవు. నీకు వందనములు. అన్ని స్థలములలో ఉన్న నీకు వందనములు. నీవు లేని స్థలము లేదు. నీవు లేకుండా యేదియు లేదు గనుక స్తోత్రములు. రెప్పపాటులో ఎక్కడకు బడితే అక్కడకు, యెప్పుడుబడితే అప్పుడు వెళ్ళగలవు. నీవు సర్వవ్యాప్తివైయున్నావు. అంత గొప్ప అంతస్థు మాకు కూడా అనుగ్రహించినందులకు వందనములు.

**8. జీవము:-** జీవమైయున్న దేవా! నాలోని జీవము నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చునప్పుడు మరలా నాలో నూతన జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవ స్తోత్రములు.

**9. జ్ఞానము:-** జ్ఞానమైయున్న దేవా! నీవు జ్ఞానివి గనుక నా కష్టములు, నాకోరికలు నేను నీకు చెప్పుకొనక ముందే నీకు తెలిసేయున్నవి. అందుచేత నీవు నా కోర్కెలు తీర్చగలవు. నా కోర్కెలు నెరవేర్చుటకు ఎన్నో చిక్కులు అడ్డముగా వున్నను. ఆ చిక్కులన్నియు విడదీసి నా కోర్కెలు నెరవేర్చగల జ్ఞానోపాయము నీకు గలదు. గనుక నీకు నాకు తెలిసినన్ని వందనములు. నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు చేయుచున్నాను.

**10. నిరాకారము:-** నిరాకారుడవైన దేవా! నా బలహీనతను బట్టి నేను నిన్ను చూడలేకపోయినను నీవు నన్ను చూచుచున్నావు. నీవు నిరాకారుడవు. అయినప్పటికిని నాకు ఉపయోగకరమైన శరీరాకారమును

దయచేసినావు. మరియు నా ఆత్మకు నిరాకారము అనుగ్రహించినావు. కాబట్టి నా శరీరముతోను నా ఆత్మతోను నిన్ను స్తుతించుచున్నాను.

**11. స్వతంత్రత:–** స్వతంత్రుడవై యున్న తండ్రీ! సమస్త కార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ! నీకు స్తోత్రములు. నేను కూడ స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహింపగలవు. నీ మీద మాత్రమే ఆధారపడి నాలోని స్వతంత్రతను బట్టి నా కార్యములు చేసికొనగల స్థితి అనుగ్రహించినావు గనుక నీకు స్తోత్రములు. స్వేచ్ఛాపూర్వకమైన స్తోత్రములు. బలవంతము లేక కేవలము స్వతంత్రముగా నిన్ను స్తుతింప గోరుచున్నాను. నీ గుణములన్నియు నాకు కూడ అనుగ్రహించుట వలన నీ లక్షణరూపము నీ కోరిక నాకు అనుగ్రహించినావు. అన్నియు అను గ్రహించి ఒక్క స్వతంత్రత లక్షణముగాని అనుగ్రహింపకున్న యెడల తక్కినవన్ని యిచ్చినను ప్రయోజనములేదు. గనుక స్వాతంత్ర్య లక్షణము యిచ్చినందుకు నీకు స్తోత్రములు,

**12. త్రైక స్థితి:–** తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మలను పేరులతో బయలుపడిన త్రియేక దేవుడవైన తండ్రీ! నీ ప్రత్యక్షత విషయమై నీకనేక వందనములు. నీవు నాకు దాగియుండు దేవుడవుకావు. గాని బయలుపడు దేవుడవు నీ లక్షణములు, నీ క్రియలు, నీ గొప్పతనము నాకు బైలు పర్చు దేవుడవు గనుక నీకు వందనములు. నీవు ఒక్కడవుగాను, ముగ్గురవు గాను బయలుపడినావు. ఈ మర్మము నాకు తెలియదు. గాని నమ్ము చున్నాను. నేను నీ యొద్దకు, పరలోకమునకు చేరినప్పుడు తెలిసికొనగలను. నీ అపరిమిత జ్ఞానస్థితిని నా పరిమిత జ్ఞాన స్థితితో ఎట్లు తెలిసికొనగలను? అనంత కాలము నీ విషయములు క్రొత్త క్రొత్తగా తెలిసికొనుచునే యుందును. నీ ప్రత్యక్షతకును నేను తెలిసికొనుటకును అంతము లేదు. గనుక నీకు అంతములేని స్తుతులు చెల్లించుచున్నాను.

13. మహిమ స్వరూపీ! ఆనంద స్వరూపీ! నేను నిత్యము నీ మహిమ కొరకు నీ ముఖ దర్శనములో, నీ సన్నిధిలో నీ సహవాసములో మిగుల ఆనందముగా గడుపగల స్థితి నాకు దయచేయుదువని నమ్ముచూ నీ కనేక వందనములు చేయుచున్నాను.

# 5. దైవలక్షణముల స్తుతి

## (సమర్పణ ప్రార్థనలోని స్తుతులు)

**1.** దేవా, తండ్రీ! నా నిమిత్తమై సమస్తమును కలుగజేసిన తండ్రీ! అనుదినము మాకు కావలసినవన్నియు అందించుచున్న తండ్రీ! నా ప్రియుడవైన తండ్రీ! నా దేవా, నా ప్రభువా! నా పోషకుడా, నా రక్షకుడా. నా సర్వమా! నీ కనేక నమస్కారములు. తండ్రీ! సృష్టి మూలముగ మాత్రమే గాక. నీ కుమారుని మూలముగ కూడ నన్ను నీ బిడ్డగా ఏర్పరచు కొన్నందులకై నీ కనేక వందనములు.

నీ దానముల మూలముగాను, నీ సహింపు మూలముగాను. నీ నడిపింపు మూలముగాను, మా కష్టములు నివారణ చేయు నీ క్రియల మూలముగాను, నాకు నీవు చూపుచున్న ప్రేమను త లంచుకొని నిన్ను స్తుతించుచున్నాను. గాని నా స్తుతి నీ ప్రేమ యెదుట యేమాత్రము? నా అంతరంగమందున్న కృతజ్ఞత నీ అనంత ప్రేమ యెదుట యేమాత్రము? నేను ఏదియు ముట్టుకొనక స్తుతి మాత్రమే చేసినను అది సహితము నీ కనికరము యెదుట మిక్కిలి స్వల్పమై ఉండును. ఆ స్వల్ప స్తుతులను కూడ హస్తార్పణముగా అందుకొనుచున్నావు. గనుక నీకు వందనములు. నీవు నన్ను నేటివరకు కాపాడుచు, నడిపించుచు, వృద్ధిలోనికి తీసికొని వచ్చుచున్న నీ శక్తిని తలంచుకొని స్తుతించుచు, యిక ముందునకు కూడ

నా విషయములో యిట్టి కార్యములు చేయుచుందువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాను. నా జీవితాంతమందు నిశ్చయముగ నన్ను పర లోకమునకు చేర్చుకొందువని నిరీక్షించుచున్నాను. నీ కనేక వందనములు.

**2.** (1) అనాది దేవా! అనంతదేవా! ఉన్నదేవా! సృష్టింప బడకుండనున్న దేవా! నీ గొప్పతనమునకు అనేక స్తోత్రములు.

(2) జీవమైయున్న దేవా! నాలోని జీవము నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చునప్పుడు మరల నాలో నూతన జీవము ధార పోయుదువు. గనుక నీకు నిత్యజీవ స్తోత్రములు

(3) అనంత దేవా! నీవు యెల్లప్పుడు ఉండగల దేవుడవు గనుక నీకు నిత్య స్తోత్రములు. నీవు యెల్లప్పుడుండువాడవు గనుక నీకు అనంత స్తోత్రములు.

(4) శక్తి మంతుడవగు దేవా! నా విషయములో యెంత గొప్ప కష్టమైన పనియైనను. అసాధ్యమైన పనియైనను చేయగలవు. గనుక నీకు నా శక్తికొలది వందనములు.

(5) జ్ఞానివైయున్న దేవా! నీవు జ్ఞానివి గనుక నా కష్టములు. నా కోరికలు నేను నీకు చెప్పుకొనకముందే నీకు తెలిసేయున్నవి. అందుచేతనే నీవు నా కోర్కెలను తీర్చగలవు. నా కోర్కెలు నెరవేర్చుటకు యెన్ని చిక్కులు అడ్డముగా నున్ననూ. ఆ చిక్కులన్నియు విడదీసి నా కోర్కెలు నెరవేర్చగల జ్ఞానోపాయము నీకు గలదు. గనుక నీకు నాకు తెలిసినన్ని వందనములు. నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు చేయుచున్నాను.

(6) పరిశుద్ధుడవైన దేవా! నీవు నన్నును. సమస్తమును కలుగజేసినప్పుడు పరిశుద్ధముగానే కలుగజేసినావు. గాని పాపప్రవేశమును బట్టి నాకు అపరిశుద్ధత కలిగెను. అయినను నీ పరిశుద్ధతను బట్టి నాకు మరల పరిశుద్ధత దయచేయగలవు. గనుక నిష్కళంకమైన పరిశుద్ధ మనస్సుతో నీకు స్తుతులు చేయుచున్నాను

(7) ప్రేమా స్వరూపివైన తండ్రీ! భూలోకమందలి తల్లితండ్రులు తమ బిడ్డలను ప్రేమించుట కన్న, నన్ను నీవు యెంతో యెక్కువగా ప్రేమించుచున్నావు. కాబట్టి నీకు నా ప్రేమ వందనములు.

(8) న్యాయ స్వరూపివైన దేవా! నేను పొరబాటులో నున్నప్పుడు న్యాయమైన రీతిగా నన్ను గద్దించి, ప్రేమతో శిక్షించు దేవుడవు. గనుక నీకు వందనములు ఆచరించుట న్యాయమైయున్నది. గనుక నీకు వందనములు ఆచరించుచున్నాను.

(9) నిరాకారుడవైన దేవా! నా బలహీనతనుబట్టి నేను నిన్ను చూడలేకపోయినను నీవు నన్ను చూచుచున్నావు. నీవు నిరాకారుడవు. అయినప్పటికిని నాకు ఉపయోగమైన శరీరాకారమును దయచేసినావు. మరియు నా ఆత్మకు నిరాకారము అనుగ్రహించినావు. కాబట్టి నా శరీరముతోను నా ఆత్మతోను నిన్ను స్తుతించుచున్నాను.

(10) సర్వవ్యాపివైయున్న తండ్రీ! నీవు పరలోకమందును, భూలోకమందును, అన్ని స్థలములలో ఉండగలవాడవు గనుక నీకు స్తోత్రములు. నేను యెక్కడున్నను నీవు అక్కడుందువు, ఉండగలవు. నీవు నా జతగా ఉండగలవు, ఉండి సహాయము చేయగలవు. నేను ఒంటరిగా ఉన్నాను అను చింతలేకుండ చేయగలవు. కనుక నీకు వందనములు. అన్ని స్థలములలో నీకు వందనములు.

(11) స్వతంత్రుడవైన ప్రభువా! సమస్త కార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ! నీకు స్తోత్రములు. నేను కూడ స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహింపగలవు. నీ మీద మాత్రమే ఆధారపడి నాలోని స్వతంత్రమును బట్టి నా కార్యములు చేసికొనగల స్థితి అను గ్రహించినావు గనుక నీకు స్తోత్రములు. స్వేచ్ఛా పూర్వకమైన స్తోత్రములు. బలవంతముగా కాక కేవలము స్వతంత్రముగా నిన్ను స్తుతింప

గోరుచున్నాను. నీ గుణములన్నియు నాకు కూడ అనుగ్రహించుట వలన నీ లక్షణ రూపము, నీకోరిక నాకు అనుగ్రహించినావు. అన్నియు అనుగ్రహించి ఒక్క స్వాతంత్ర్య లక్షణము అనుగ్రహింపకున్న యెడల తక్కినవన్నియు యిచ్చిన ప్రయోజనము లేదు. కనుక స్వాతంత్ర్య లక్షణము యిచ్చినందుకు నీకు స్తోత్రములు.

(12) తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మలను పేరులతో 'బైలుపడిన త్రియేక దేవుడవైన తండ్రీ! నీ ప్రత్యక్షత విషయమై నీకనేక వందనములు. నీవు నాకు దాగియుండు దేవుడవు కావు. గాని బైలుపడు దేవుడవు. నీ లక్షణములు, నీ క్రియలు, నీ గొప్పతనము, నాకు బైలుపర్చు దేవుడవు గనుక వందనములు. నీవు ఒక్కడవుగాను ముగ్గురవుగాను బైలుపడినావు. నీ మర్మము మాకు తెలియదుగాని నమ్ముచున్నాను. నేను నీ యొద్దకు, పరలోకమునకు జేరినప్పుడు తెలిసికొనగలను. నీ అపరిమిత జ్ఞానస్థితిని నా పరిమిత జ్ఞానస్థితితో ఎట్లు తెలిసికొనగలను? అనంత కాలము నీ విషయములు క్రొత్త క్రొత్తగా తెలిసికొనుచునే యుందును. నీ ప్రత్యక్షతకును నేను తెలిసికొనుటకును అంతములేదు. గనుక నీకు అనంత స్తుతులు చెల్లించుచున్నాను.

(13) మహిమ స్వరూపీ! ఆనంద స్వరూపీ! నేను నిత్యము నీ మహిమ కొరకు నీ ముఖదర్శనములో, నీ సన్నిధిలో, నీ సహవాసములో. మిగుల ఆనందముగా గడుపగల స్థితి దయచేయుదువని నమ్ముచూ నీ కనేక వందనములు చేయుచున్నాను.

(14) మాకు శరీరమును అనుగ్రహించిన దేవా! నీకు వందనములు. ఈ శరీరము పాపశరీరమైనందున దీనిని పరిశుద్ధ శరీరముగా మార్చుచున్నావు. తుదకు నాకు మహిమ శరీరము యిచ్చి నీయొద్దకు తీసుకొనివెళ్ళుదువు గనుక నీకు వందనములు. నీవు మూడు

విధములుగా బయలుపడినావు. అట్లే నాకు మూడు విధములైన స్థితులు అనుగ్రహించినావు. జీవము, శరీరము, ఆత్మ అను మూడు స్థితులు దయచేసినందుకు నీకు వందనములు. ఈ మూడు కలిపి నన్ను ఒక వ్యక్తిగా నిలిపినావు గనుక నీకు స్తోత్రములు. నేను ఒక విధముగ నీకు బిడ్డవలెనున్నాను. మరియొక లెక్కకు మూడుగా నున్నాను. ఈ పవిత్రమైన సృష్టి నిమిత్తమై నీకు వందనములు. నీవు నాకు యిచ్చిన వన్నియు నేను నిలుపుకొనునట్లు తోడ్పడుదువని నమ్మి వంద నములు చేయుచున్నాను.

**3.** తండ్రీ! నీ స్థితిని, నీ క్రియలను, నీ దివ్య గుణములను, నా యెడల ఉన్న నీ తీరును, నీ మహిమను ఎవరు వర్ణింపగలరు? నీకనేక వందనములు.

**4.** దానకర్తవైన తండ్రీ! నీ ఉచితదానముల నిమిత్తమై నీకు స్తోత్రములు. గాలి ఉచితము. నేను పన్ను కట్టుటలేదు. ఒకవేళ నేను కట్టినను అదిచాలదు. నీ ఉచిత ధర్మము నిమిత్తమై అవి యున్నంత కాలము నీకు స్తోత్రములు లోకాన్ని కలుగజేసినది. మొదలుకొని లోకాంతము వరకు నీవు నరులందరకు అవిశ్వాసులకు, విశ్వాసులకు, మృగములకు, వృక్షాదులకు, జీవరాసులకు ఉచితముగా ధర్మము చేయుచునే యున్నావు. ఇవన్నియు మేము సంపాదించుకొనవలెనన్న యెడల రవ్వంతయైనను సంపాదించుకొనలేము. ఎన్నో పండ్లు ఎన్నో కూరగాయలు యిచ్చుచున్నావు. మానవులు తినగా ఎన్నో మిగిలిపోవుచున్నవి. నీ కనేక స్తోత్రములు. నీళ్ళు కూడ మిగిలిపోవుచున్నవి. నీవు భూమిలో పెట్టిన ఖనిజములు, లోహములనేకములున్నవి. మానవులు ఇంకా వీటిని తీసికొని వాడుకొనలేదు. కొన్ని వాడుకొనుచున్నారు. తరుగడములేదు. నీవు మా యెదుట వేసిన భోజనపు బల్లమీద నున్న పదార్ధములు యింకా తరుగడము లేదు. ఒక దరినుండి మేము వాడుకొనుచుండగా, నీవు ఒక దరినుండి

యింకను క్రొత్తవి యిచ్చుచునే యున్నావు. నీ దాన స్వభావమును ఎవరు వర్ణింపగలరు?. మా తెలివి తక్కువ తనము వల్ల మేము వాటిని పూర్తిగా వాడలేకపోవుచున్నాము. నీ దానములు అందుకొను శక్తి నరులందరికు ఉన్న యెడల అందరును ధనికులే. ఒక్కరైనను బీదవారుండరు. నీవు కలుగజేసిన వాటిలో ఉపయోగము లేనిది. యేదియులేదు. నా విషయమై నీకు ప్రతిదినము ఎంతో ఖర్చు ఉన్నది. నీవు బిల్లువేసిన యెడల నేను యివ్వగలనా? ప్రతి నిమిష దానములను బట్టి నీకనేక వందనములు.

**5.** ఓ తండ్రీ! నీవిచ్చిన అన్ని దానములకంటే నీ కుమారుని పంపిన దానము గొప్పది. అనంతమైనది. అందుకు నిన్ను నేను స్తుతింప వలెను. నీవు కోరిన యెడల ప్రతి రెప్పపాటున నిన్ను స్తుతింపవలెను. నీ కుమారుని అవతార దానమునకు మించిన దానము లేనేలేదు. ఆ దానమును బట్టి నీకు స్తోత్రములు. నేను పాప విసర్జన చేయవలెననియు, బాప్తీస్మము పొందవలెననియు, రక్షణ అందుకొనవలెననియు. సంస్కార భోజనము భుజింపవలెననియు, ఇతరుల రక్షణార్థమై సేవ చేయ వలెన నియు. నీ వాక్యగ్రంథమును హృదయములో అచ్చువేయించు కొనవలెన నియు, జీవాంతమందు నీ సన్నిధికి వచ్చి వేయవలెననియు, నీవు కోరుచున్న కోరికకు యేమి చెప్పగలను! నీ దానములు లెక్కపెట్టుటకు కూర్చున్న యెడల మా దీర్ఘ జీవిత కాలము చాలదు. మా విశ్వాసము, మా గ్రహింపు. మా స్తుతి నీ దృష్టి యెదుట మిగుల స్వల్పమైనను నీవు అంగీకరించుట ఆశ్చర్యముగా వున్నది. ఏమి చెప్పగలను! ఏమి వివరించ గలను! ఎంత జాగ్రత్తగా స్తుతి చేసినను యెప్పుడు పూర్తిగా కుదరదు. అయినను నీవు ఆనందించుచున్నావు. నీకు స్తోత్రములు. నీ కుమారుని దానమునకు వెలుపల ఏ దానములు లేవు. నీవు చూపుచున్న కృప వెలుపల ఏ కృపయు లేదు. సంఘము యొక్క వెలుపల రక్షణలేదు. నీ మహత్తు విషయమై నీకు లెక్కకు మించిన స్తోత్రములు.

**6.** నా జన్మము, నా బ్రతుకు ఎంత పవిత్రముగా నున్నను మరణ సమయమందు పరలోకమునకు నేను సిద్ధముకానియెడల మా దీర్ఘాయుష్షు అంతయు వ్యర్థమే. ఒకవేళ నేను మరణ సమయమునందు సిద్ధముగా నున్నయెడల మోక్షప్రవేశము కలిగించుకొనుటకు ధన్యత కలదు. అంతకన్న మించిన అంతస్తుగల మరియొక ధన్యకాలము కలదు. ఆ కాలమునకు మా ప్రభువు యొక్క రెండవ రాకడకు నేను సిద్ధపడని యెడల భూమిమీద శ్రమలు అనుభవించుటకు మిగిలిపోదును. నేను అంతకాలము భక్తిగా బ్రతికి. అన్నియు నమ్మి రెండవ రాకడ నమ్మకయు, నమ్మినను సిద్ధపడకయు నున్న యెడల నాకు యెంత దౌర్భాగ్యత దాపరించును. భక్తిగల జీవనము, భక్తిగల మరణము, సజీవుల గుంపులో చేరవలసిన ఆరోహణము మాయెదుట పెట్టియున్నావు. గనుక నీకు స్తోత్రములు. లేనియెడల మా బ్రతుకు వలన ప్రయోజనమేమి? ఇట్టి ప్రయోజనములేని స్థితి నాకు రాకుండ చేయగల తండ్రీ! నీకు స్తోత్రము.

# 6. దైవలక్షణముల స్తుతి

## జన్మదినము మొదలు నేటివరకు శరీర సంబంధమైన మేళ్ళను గూర్చిన స్తుతులు

1. ఓ మహిమా స్వరూపివైన దేవా! నేను పుట్టకముందే అనగా తల్లి గర్భమందు రూపింపబడక ముందే మా నిర్మాణ విషయములన్నియు నీ పుస్తకములో వ్రాసిపెట్టినావు. దీనిని బట్టి చూచిన మామీద నీకుగల ప్రేమ, జ్ఞానము, శ్రద్ధ అను వాటిని బట్టి నిన్ను స్తుతించుచున్నాను.

2. ఓ దేవా! మేము జన్మించిన పిమ్మట మేము జీవము కలిగియున్నప్పటికిని మమ్మును మేము కాపాడుకొనలేమని నీవు యెరిగిన వాడవై. ఆ పని మా తల్లిదండ్రులకు అప్పగించినావు గనుక నీకు స్తోత్రములు. నీ కృపలో ఒక భాగమైయున్న నీ కాపుదలను స్మరించుచూ నీకు వందనములు అర్పించుచున్నాము.

3. ఓ దేవా! మమ్మును పోషించవలసినదని మేము నిన్ను అడుగలేదు. అయినను మమ్మును పాలవలనను, ఆహారము వలనను పోషించుచున్నావు. నీ పోషణను, నీ ప్రేమను తలంచుకొని నిన్ను ఘనపరచు చున్నాము.

4. ఓ దేవా! మాకు అనుదినాహారము మాత్రమే గాక తిను బండారములను దయచేయవలసినదని నేను నిన్ను అడుగకపోయినను అవి కూడ దయచేయుచున్నావు గనుక నీకు కీర్తి కలుగును గాక!

5. ఓ దేవా! సమస్త వస్తువులు నా ఉపయోగనిమిత్తమై కలుగజేసి ఇచ్చిన నీ కృప నిమిత్తమై నీ ధర్మ ఉపయోగ నిమిత్తమై నీకు ప్రభావము కలుగును గాక!

6. ఓ దేవా! వస్త్రములు దయచేయుమని మేము నిన్ను అడుగక పోయినను అవి కూడ దయచేసిన నీకు కృతజ్ఞతాస్తుతులు. చెల్లించు చున్నాము. కష్టపడి సంపాదింపని వాటిని కూడ అనుగ్రహించు చున్నావు. ఈ నీ సంపాదన ప్రేమ నిమిత్తమై నిన్ను ఘనపరచుచున్నాము.

7. ఓ దేవా! మమ్మును బడికి పంపించి అందుకు అవసరమైన వస్తువులు, పుస్తకములు యిప్పించి విద్యనేర్పించిన ఉపాధ్యాయ ప్రేమ నిమిత్తమై నీకు చాలా వందనములు చెల్లించుచున్నాము.

8. ఓ దేవా! నాకు చదువు చెప్పు ఉపాధ్యాయులను, విద్యలోను, ఆటలలోను, సహకారులుగా ఉండవలసిన తోటి పిల్లలను అను గ్రహించినావు. గనుక నీకు స్తోత్రములు. నీ సహాయ ప్రేమ నిమిత్తమై నీకు అనేక నమస్కారములు.

9. ఓ దేవా! మేము చదువు ముగించిన తరువాత ఏదో ఒక పనిలో ప్రవేశ పెట్టినందుకు నీకు ప్రభావములు కలుగును గాక! మా

పనిలో తోడు, సహాయము అనుగ్రహించుచున్న నీ ప్రేమకు స్తుతి కల్గును గాక!

10. ఓ దేవా! మా దేశమును న్యాయముగాను. చక్కగాను పరిపాలించే అధికారులను అనుగ్రహించినావు. వారు మమ్మును కాపాడు విషయములోను, సహాయముచేసే విషయములలోను పూచీదారులై యుండునట్లు చేసినావు గనుక స్తోత్రములు మరియు ఆ అధికారము నీ వలననే కలిగినది. అందువలన నీవు అందరిపై అధికారివై యున్నావు గనుక నీకు కృతజ్ఞతార్పణలు చెల్లించుచున్నాము.

11. ఓ దేవా! దేశములో మాత్రముగాక ఇంటిలో కూడ అధికారులను బోలిన తల్లితండ్రులను. మాకంటే పెద్దవారైన సోదర సోదరీలను మా మేలు కోరిన వారినిగా ఏర్పాటుచేసిన నీకు వేలాది నమస్కారములు.

12. ఓ దేవా! మా సంతోషాభివృద్ధి నిమిత్తమై స్నేహితులను. బంధువులను అనుగ్రహించియున్నావు. స్తోత్రములు. వీరికంటె నీవు గొప్ప స్నేహితుడవు. బంధువుడవైయున్నావు. అందుకు నిన్ను పూజించుచున్నాము. మనుష్యుల ద్వారా నీవు మాకు చేయుచున్న సమస్త ఉపకారముల నిమిత్తమై నీకు స్తోత్రములు

13. ఓ దేవా! మత భక్తి నిమిత్తము మమ్మును కాపాడుటకు ఇవాంజిలిస్టులను, పాదిరులను, మిషనెరీలను అనుగ్రహించిన నీకు ఘనత కలుగునుగాక! అందరికంటే నీవు గొప్ప గురువువై యున్నావు. గనుక నీకు పూజార్పణలు యేసు నామమున అర్పించుచున్నాము. ఆమెన్. (నెహెమ్యా 9:5,6)

**స్తుతి ప్రార్థన:-** ఓ దేవా! నీవు ప్రేమవైయున్నావు. గనుక నేనెంత పాపినైనను నన్ను ప్రేమించుచున్నందులకు నీకు స్తోత్రములు.

ఓ దేవా! నీవు శక్తిమంతుడవైయున్నందున, నాకు అన్నియు దయ చేయగలవు. అన్ని పనులలోను సహాయము చేయగలవు. అందుచేత నీకు వందనములు చెల్లించుచున్నాను.

ఓ దేవా! నీవు పరిశుద్ధుడవైయున్నందువలన సృష్టిని. మానవుని పరిశుద్ధముగా కలుగజేసియున్నావు. మానవుడు పాపము చేయుట ద్వారా పరిశుద్ధతను కోల్పోయినను తిరిగి పరిశుద్ధులనుగా చేయుటకు నీవే లోకమునకు బలియైతివి. ఇందుకు నీకు స్తోత్రములు.

జీవమైయున్న ఓ దేవా! మట్టి ఘటమైన మానవునిలోనికి నీ జీవాత్మను పంపి జీవింపజేయు చున్నందుకు స్తోత్రములు. ఓ దేవా! నీవు సర్వవ్యాపివి. గనుక నేను ఎక్కడ వుంటే నీవు అక్కడుందువు. గనుక ఓ దేవా! నీవు ఆది, అంతములేని దేవుడవు గనుక నాతో యెల్లప్పుడునుందువు గనుక నీకు మహిమ కలుగునుగాక! ఆమేన్.

# దైవలక్షణములు - స్తుతి

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

'స్తుతియాగము అర్పించువాడు నన్ను మహిమ పరచుచున్నాడు. నేను వానికి దేవుని రక్షణ కనుపరచునట్లు వాడు మార్గము సిద్ధపరచుకొనెను' కీర్తనలు 50:23.

గుంటూరు -2024 చందా : 15.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1979 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1981 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1988 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1992 | ప్రతులు | 4000 |
| ఐదవ | ముద్రణ | 1996 | ప్రతులు | 5000 |
| ఆరవ | ముద్రణ | 2000 | ప్రతులు | 10000 |
| ఏడవ | ముద్రణ | 2005 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2008 | ప్రతులు | 10000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2010 | ప్రతులు | 5000 |
| పదవ | ముద్రణ | 2011 | ప్రతులు | 10000 |
| పదకొండవ | ముద్రణ | 2013 | ప్రతులు | 5000 |
| పన్నెండవ | ముద్రణ | 2014 | ప్రతులు | 5000 |
| పదమూడవ | ముద్రణ | 2016 | ప్రతులు | 5000 |
| పదునాల్గవ | ముద్రణ | 2017 | ప్రతులు | 5000 |
| పదిహేనవ | ముద్రణ | 2018 | ప్రతులు | 5000 |
| పదహారవ | ముద్రణ | 2020 | ప్రతులు | 3000 |
| పదిహేడవ | ముద్రణ | 2021 | ప్రతులు | 3000 |
| పద్దెనిమిదవ | ముద్రణ | 2022 | ప్రతులు | 5000 |
| పంతొమ్మిదవ | ముద్రణ | 2024 | ప్రతులు | 3000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

**ముద్రణ :**

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ :9949121777.

# విషయములు

## దైవలక్షణముల జాబితా


1. ప్రేమ
2. జీవము
3. సర్వశక్తి
4. పరిశుద్ధత
5. సర్వజ్ఞానము
6. న్యాయము
7. సర్వవ్యాపకత్వము
8. స్వతంత్రత
9. నిరాకారము
10. అనాది
11. అనంతము


Bible Mission HQ Guntur

# ప్రశంస

ప్రియ చదువరులకు, ప్రభువైన క్రీస్తు తన దివ్య లక్షణములను మీ అంతరంగమునకు అద్ది ఆయన స్వరూపమును అనుగ్రహించునుగాక!

ఈ చిన్న పుస్తకములో దేవుని దివ్య లక్షణములను తలంచుకొని స్తుతించుట గలదు. దైవజనుడైన ఫా॥ యం. దేవదాసు అయ్యగారు వాక్యములో నున్న ఈ లక్షణములను ఎత్తి స్తుతించిరి. స్తుతించుట వేరు, ప్రార్థించుట వేరు. ఇప్పటికాల సంఘము ప్రార్థనలోనే స్తుతి, స్తుతిలోనే ప్రార్థన గల ప్రార్థన చేయుట అలవాటు కలిగియున్నది. కాని వేరువేరుగా చేయుట చేతగాని పనిగా నున్నది. కొందరు స్తోత్రము అనుటయే స్తుతి అనుకొందురు ఆలాగున నాయకులు నడిపించుచున్నారు. దేవుడు చేసిన మేలు తలంచుకొని స్తుతించ వచ్చును. అట్టి స్తుతి మతిలేని స్తుతి. దానికి గతి ఉండదు. అనగా ప్రతిఫలము ఉండదు. ప్రభువునకు మహిమ కలుగదు. అది నామకార్థమను పాపము చేయుచున్నారు. ఒక స్తోత్రము అను మాటయే స్తుతి అనుకొను చున్నారు. అది పొరపాటు. ఈ క్రింది పదములు అన్నియు స్తుతి చేయుటకు వాడవచ్చును. వందనములు, స్తోత్రములు, స్తుతులు, నుతులు, ప్రణుతులు, నమస్కారములు, మంగళ స్తోత్రములు, నిత్య మంగళ స్తుతులు, హృదయ పూర్వక వందనములు, ఆగని వందనములు, తరుగని స్తుతులు.

పరిశుద్ధులైన యం. దేవదాసు అయ్యగారు దైవ లక్షణములు తీసి స్తుతి చేసినప్పుడు బహుగా ఆశ్చర్యపడినాము. దైవలక్షణములు సృష్ఠి విషయ ములోను, మానవుని విషయములోను ముఖ్యముగా విశ్వాసి విషయములో ఎట్లు నిత్యము పని చేయుచున్నవో గ్రహించి స్తుతి చేసిరి. ఇట్టి స్తుతి ప్రపంచములో ఎవ్వరు చేయలేరు. గనుక ఈ చిన్న పుస్తకము "ప్రపంచమునకే నూతన పుస్తకము." వీరు లోకమునకు చూపించిన "సైతానును ఎదిరించుట" కూడ లోకమునకు నూతన గ్రంథము. ఈ గ్రంథము చదువువారు ప్రభువునకు మహిమ కలుగునట్లు సరియైన రీతిని స్తుతించుట నేర్చుకొనగలరు. ఒక

దినము దైవలక్షణములలో ఒకటైన "పరిశుద్ధత" ఉదయం 8 గంటల నుండి సాయంకాలము 4 గంటల వరకు స్తుతి చేసిరి. స్తుతి మాత్రమే ప్రార్థనకాదు. అట్టివి అనేకములు వారి జీవితములో చేసిరి. వాటిని వ్రాయగలిగినాము, కొన్ని వ్రాయలేక పోయినాము. వ్రాతలో ఉన్నవన్నియు మేము ఈ పుస్తకములో చేర్చనందున చింతించుచున్నాము. వారి ఉపదేశములన్నిటిని లోకమునకు అందించ గలుగునట్లు ప్రార్థించండి.

ఈ గ్రంథము చదువువారు పెండ్లికుమారుని అంతరంగమునకు మనోహరముగా నుండు పెండ్లికుమార్తె వరుసకు తగిన స్తుతి చేయునట్లు ఆత్మ తండ్రి మనోదృష్టిని వెలిగించును అను ప్రార్థనతో ఈ పుస్తకమును మీకందించుచున్నాము. రాకడలో ఎత్తబడు వధువు సంఘమును ఆయత్త పరచుచున్న పరిశుద్ధాత్మ తండ్రి త్వరగా రానైయున్న ప్రభువుయొక్క మహిమ రాకడకు చదువరులను ఆయత్త పరచునుగాక! ఆమేన్.

ఈ పుస్తకములు అచ్చు వేయుటకు సహాయపడిన కీర్తిశేషులు శ్రీమతి. పి.జె. గ్రేసమ్మ (విజయవాడ) గారికి మా వందనములు. మన పెండ్లి కుమారుడైన క్రీస్తుప్రభువు వధువు రూపమిచ్చి షెకీనా మేఘములోనికి ఆకర్షించి ప్రభువిచ్చు నోటి ముద్దు (ప॥గీ॥ 1:1) అందుకొను భాగ్యము కలిగించునుగాక!

ఈ వ్రాతలు అనేకములు గలవు. ప్రచురించుటకు సహాయపడ గోరువారు ముందుకు రావలయునని కోరుచున్నాము. రాకడలో మీరును ఆరోహణము కావలెనని కోరుచున్న

**రెవ. జె. శామ్యేల్ కిరణ్**

ప్రెసిడెంట్, బైబిలుమిషను,
బేతేలు గృహము, రైలుపేట
గుంటూరు - 522001.